GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : గురువారం- మే 14-2026 పేజీలు : 4

## అందరికీ ధన్యవాదాలు



**టీ మీడియా, మే 13 ,ఖమ్మం:** నా దీక్షకు ప్రత్యక్షంగా మద్దతు తెలిపి విరమించే వరకు వెంట ఉన్న ఖమ్మం ఆన్‌లైన్ బైక్ రైడర్స్ అసోసియేషన్ నాయకులు పాపినేని నర్సింహారావు గారికి, ఫోన్/మెసేజ్ ద్వారా పర్సనల్‌గా, గ్రూప్‌లో మద్దతు తెలిపిన జర్నలిస్ట్ సంఘాల నాయకులకు, జర్నలిస్ట్ మిత్రులకు, మంత్రి పొంగులేటి గారిని కలవడానికి నా ఆఫీస్‌కు వచ్చి తన బండి పైన తీసుకువెళ్లి వచ్చిన ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, మిత్రుడు నామ పురుషోత్తం గారికి, ఎల్ఐసీ యూనియన్ నాయకులు, వైజాగ్ వాసి రాధాకృష్ణమూర్తి గారికి, టీ-మీడియా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు.

**ఇట్లు**

**శనగపాటి మురళి కృష్ణ**
**ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**టీ-మీడియా కుటుంబం**



## ములాయం సింగ్ యాదవ్ కుమారుడు హఠాన్మరణం

**టీ మీడియా, మే 13 , న్యూఢిల్లీ బ్యూరో :** సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపక నేత ములాయం సింగ్ యాదవ్ చిన్న కుమారుడు ప్రతీక్ యాదవ్ (33) కన్నుమూశారు. బుధవారం (మే 13)తెల్లవారు జామున 6.15 గంటలకు లక్నో సివిల్ ఆస్పత్రికి ఆయనను తరలించగా.. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌కు ప్రతీక్ యాదవ్ సవతి సోదరుడు. ప్రతీక్ యాదవ్ రాజకీయ కుటుంబానికి చెందినప్పటికీ ఫిట్‌నెస్ పట్ల అమితమైన ఆసక్తి కనబరిచేవారు. క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండేవారు. అయితే ప్రతీక్ యాదవ్ భార్య అపర్ణ యాదవ్ మాత్రం బీజేపీలో చేరి, ప్రస్తుతం రాష్ట్ర మహిళా కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. మలయం సింగ్ యాదవ్ రెండో భార్య సాధనా గుప్తా కుమారుడు ప్రతీక్ యాదవ్. ములాయం సింగ్ యాదవ్ 2022 అక్టోబర్‌లో మరణించిన సంగతి తెలిసిందే.ఈ రోజు ఉదయం తెల్లవారు జామున ప్రతీక్ యాదవ్‌కు అత్యవసర వైద్య సహాయం అందించాలని అతని డ్రైవర్ ఆసుపత్రికి రావడంతో.. ఆస్పత్రి నుంచి ఓ వైద్యుడు అతని నివాసానికి పంపినట్లు లక్నో సివిల్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దేవేష్ చంద్ర పాండే తెలిపారు. అయితే ప్రతీక్‌ను ఆసుపత్రికి తీసుకువచ్చేసరికే ఆయన మరణించారని, మరణానికి గల కారణాన్ని గుర్తించేందుకు ఆయన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపినట్లు డాక్టర్ పాండే ధృవీకరించారు.

కాగా ప్రతీక్ యాదవ్.. బ్రిటన్‌లోని లీడ్స్ వర్సిటీలో ఎంబీఏ చదివారు. రియల్ ఎస్టేట్ డెవలపర్ అయిన ప్రతీక్ ఫిట్‌నెస్‌పై అమితాసక్తి కనబరిచే వారు. 2012 సెప్టెంబర్‌లో బాడీబిల్డింగ్‌కు చెందిన అంతర్జాతీయ వెబ్‌సైట్‌లో కనిపించారు. 2017లో లాంబోర్గిని కారు కొన్న కేసులో విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రతీక్ యాదవ్ చాన్నాళ్ల నుంచి శ్వాసకోస సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టింది. దీంతో చాలా కాలంగా ఆయన చికిత్స పొందుతున్నారు. అయితే ప్రతీక్‌కు ఆయన భార్య అపర్ణకు కొన్నేళ్లుగా విభేదాలు ఉన్నాయి. ఆమె తన కుటుంబాన్ని నాశనం చేసిందని ప్రతీక్ ఇన్‌స్టాలో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో పలువురు నేతలు ఆయన మృతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.ములాయం సింగ్ యాదవ్ మొదటి భార్య మాలతి దేవి. అఖిలేశ్ యాదవ్ జన్మించిన తర్వాత మాలతీ దేవి ఆరోగ్యం క్షీణించి 2003 మేలో మరణించారు. ఆ తర్వాత కొన్ని నెలల్లోనే 2003లో సాధనను ములాయం సింగ్ యాదవ్ రెండో వివాహం చేసుకున్నారు. సాధనకు కూడా ఇది రెండో పెళ్లి. ఆమె 1987లో చంద్ర ప్రకాశ్ గుప్తా అనే వ్యక్తిని పెళ్లాడారు. వారికి ప్రతీక్ గుప్తా జన్మించారు. ప్రతీక్ పుట్టిన ఏడాది తర్వాత సాధన తన భర్తకు విడాకులు ఇచ్చేసింది. వీరికి1990లో విడాకులు మంజూరీ అయ్యాయి. 2022 జులైలో సాధన మృతిచెందింది.

## అమెరికాకు 1 ట్రిలియన్

# డాలర్ల నష్టం..?

**-ఇరాన్?తో యుద్ధమే కారణం**

**టీ మీడియా, మే 13, ఢిల్లీ బ్యూరో :** ఇరాన్?తో చేస్తున్న యుద్ధం అగ్రరాజ్యం అమెరికాను ఆర్థికంగా ఇబ్బందిపెడుతోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇరాన్?తో జరుగుతున్న యుద్ధం కారణంగా, ఇప్పటి వరకు 29 బిలియన్ డాలర్లు ఖర్చు అయ్యిందని పెంటగాన్ బడ్జెట్ అధికారి, యూఎస్? చట్టసభ సభ్యులకు మంగళవారం తెలిపారు. గతంలో యూఎస్ కాంగ్రెస్?కు పెంటగాన్? సమర్పించిన 25 బిలియన్ డాలర్ల అంచనా బడ్జెట్?ను ఇది అప్పుడే దాటేసిందని పేర్కొన్నారు. అయితే ఈ అంచనాలు యూఎస్? యుద్ధ విభాగానికి సంబంధించిన తక్కువ స్థాయి ఖర్చులను మాత్రమే చూపుతోందని, మొత్తం వ్యయం ఏకంగా 1 ట్రిలియన్? డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.యుద్ధ బడ్జెట్ నిపుణురాలు లిండా బిల్మ్? మాట్లాడుతూ, "ఇరాన్?తో చేస్తున్న యుద్ధం వల్ల అయిన ఖర్చు 1 ట్రిలియన్ డాలర్లు చేరుకునే అవకాశం ఉందని నేను కచ్చితంగా అనుకుంటున్నాను" అని అన్నారు. స్వల్పకాలిక, ముందస్తు ఖర్చుల కోసమే రోజుకు సుమారు 2 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతోందని, ఇది కేవలం పైకి కనిపించే ఖర్చు మాత్రమేనని, అసలు ఖర్చులు ఇంకా ఎక్కువ ఉండే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు. కాగా, ఇరాన్?పై అమెరికా చేపట్టిన సైనిక చర్యకు ఇప్పటి వరకు దాదాపు 29 బిలియన్ డాలర్లు ఖర్చు అయ్యిందని పెంటగాన్ కంప్ట్రోలర్? జే హర్స్ట్? మంగళవారం హౌస్? అప్రోప్రియేషన్స్ కమిటీ విచారణ సందర్భంగా తెలియజేశారు.సీఎన్?ఎస్? కథనం ప్రకారం, 'అమెరికా యుద్ధ పరికరాల మరమ్మత్తులు, కొత్త ఆయుధాల భర్తీ, యుద్ధరంగంలో ఉన్న సిబ్బందికి అయ్యే సాధారణ కార్యాచరణ ఖర్చుల కారణంగానే ఈ బడ్జెట్ పెరిగింది. అయితే ప్రస్తుతం దీనికి సంబంధించిన సరైన అంచనాలు మాత్రం తమ దగ్గర లేవని పేర్కొంది. అయితే అన్ని ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటే అసలు సంఖ్య ఇంకా పెద్దగానే ఉండే అవకాశం ఉందని తెలిపింది. బహుశా ఈ యుద్ధ ఖర్చు 40 నుంచి 50 బిలియన్ డాలర్ల మధ్య ఉండవచ్చని ఓ అంచనా వేసింది'.

**పెంటగాన్ ఊహించని ఖర్చులు**



కొన్ని పరిశోధనల ప్రకారం, ఖరీదైన క్షిపణి వ్యవస్థలు వేగంగా క్షీణించడం, సైనిక నిర్వహణ ఖర్చుల వల్ల, యుద్ధం ప్రారంభమైన మొదట్లోనే అమెరికాకు కనీసం 16 బిలియన్ డాలర్లు అయ్యింది. ఇది పెంటగాన్ ఊహించని దానికంటే చాలా ఎక్కువ.మేము అసాధారణ వేగంతో యుద్ధ సామగ్రిని ఖర్చు చేస్తున్నాం. గత నాలుగేళ్లలో ఉక్రెయిన్?కు సరఫరా చేసిన దానికంటే, ఇరాన్?తో యుద్ధం మొదలుపెట్టిన నాలుగు రోజుల్లోనే యూఎస్ పెద్ద సంఖ్యలో పేట్రియాట్? క్షిపణులను ప్రయోగించాం' అని లిండా బిల్మ్? పేర్కొన్నారు. క్షిపణులు, ఇంటర్?సెప్టర్ వ్యవస్థలు, ఎయిర్?క్రాఫ్ట్? క్యారియర్? స్ట్రైక్? గ్రూపుల విస్తరణ, యుద్ధభూమి ఉన్న సైనికుల వేతనాలు, దెబ్బతిన్న సైనిక ఆస్తుల నిర్వహణ, భర్తీ వంటివి ఉన్నాయి. వీటికి రోజుకు సుమారు 2 బిలియన్? డాలర్లు ఖర్చు అయ్యింది. అయితే పెంటగాన్ అంచనా వేసిన దానికంటే, అవుతున్న ఖర్చులు భారీగా ఉన్నాయి. ఉదాహరణకు, ఇన్వెంటరీలో టోమహాక్ క్షిపణుల విలువ ఒక్కొక్కదానికి 2 మిలియన్ డాలర్లుగా ఉంది. కానీ ఈ రోజు వాటిని భర్తీ చేయడానికి 3 నుంచి 3.5 మిలియన్ డాలర్లు ఖర్చు అవుతోంది. ఇన్వెంటరీలో పేట్రియాట్ క్షిపణుల విలువ 1 నుంచి 2 మిలియన్ డాలర్లు ఉంది. కానీ కొత్త వెర్షన్ ధర ఒక్కొక్కటి 4 నుంచి 5 మిలియన్ డాలర్లు వరకు ఉంటుంది. ఇంధనం, ఇతర సరఫరాల విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది' అని బిల్మ్? అన్నారు. మరోవైపు, పశ్చిమాసియాలో దెబ్బతిన్న యూఎస్? సైనిక స్థావరాల మరమ్మతులకు, క్షిపణి, ఇంటర్?సెప్టర్? ఉత్పత్తిని పెంచడానికి లాక్?హీడ్? మార్టిన్?, బోయింగ్ వంటి కంపెనీలతో పెద్ద ఎత్తున రక్షణ ఒప్పందాలు చేసుకున్నాం. ఇది కూడా మధ్యకాలిక ఖర్చులో భాగంగా ఉందని బిల్మ్? తెలిపారు.





### పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా

## రంగసామి ప్రమాణం

**- ఐదోసారి సీఎంగా బాధ్యతలు**


**టీ మీడియా, మే 13 , పుదుచ్చేరి** : కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్?డీఏ ప్రభుత్వం కొలువుతీరింది. ఎన్?డీఏ కూటమిలోని ఆల్ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్సీ) అధినేత ఎన్? రంగసామి ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. లోక్?భవన్?లో జరిగిన ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్? కే కైలాస్?నాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతో పాటు ఇద్దరు మంత్రులు కూడా ప్రమాణం స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్,

మిగతా 4లో

# బలపరీక్షలో నెగ్గిన విజయ్

## అనుకూలంగా 144 ఓట్లు డీఎంకే వాకౌట్

**టీ మీడియా, మే 13 , చెన్నై :** తమిళనాడులో నూతనంగా కొలువుదీరిన విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం విశ్వాస పరీక్షలో గట్టెక్కింది. విజయ్‌కు అనుకూలంగా 144 ఓట్లు, వ్యతిరేకంగా 22 ఓట్లు వచ్చాయి. పీఎంకే, బీజేపీకి చెందిన మొత్తం ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా నిలిచారు. విజయ్ ప్రభుత్వం బల పరీక్షలోనెగ్గినట్టుస్పీకర్జెసిడిప్రభాకర్ప్రకటించారు.మే13వతేదీలోగామెజారిటీనిరూపించుకోవాలని గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ ఆదేశించిన నేపథ్యంలో బుధవారం 'ఫ్లోర్ టెస్ట్' నిర్వహించారు. విశ్వాస పరీక్షపై తీర్మానాన్ని సీఎం విజయ్ ప్రవేశపెట్టారు. తమిళనాడు అసెంబ్లీ చర్చ సందర్భంగా తొలుత మాట్లాడిన కాంగ్రెస్ సభ్యులు తాము విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న తొలి మూడు నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత వాపక్షాలు విజయ్‌కు మద్దతు ప్రకటించాయి. సీఎం విజయ్ ప్రమాణస్వీకారానికి ముందు గవర్నర్ ఆర్లేకర్ పలుమార్లు తిరస్కరించిన తీరుపై సీపీఎం అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడులో గవర్నర్ రూల్‌ను అడ్డుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం తమిళనాడు హక్కులను కాలరాస్తోందని సీపీఐ ఆరోపించింది. విజయ్ ఐదేళ్లపాటు కొనసాగాలని వీసీకే అశాభావం వ్యక్తం చేసింది. అయితే ఓఎస్?డీగా వ్యక్తిగత జ్యోతిష్యుడిని విజయ్ నియమించడంపై అభ్యతరం వ్యక్తం చేసింది. విజ్ఞానశాస్త్రానికి సీఎం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఏఎంఎంకే బహిష్కృత ఎమ్మెల్యే కామరాజు సైతం విజయ్‌కు మద్దతు ఇచ్చారు. ఒక్క ఎమ్మెల్యే ఉన్న డీఎండీకే సైతం విజయ్‌కు మద్దతు తెలిపింది.



**డీఎంకే వాకౌట్**

డీఎంకేతో పాటు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం వ్యతిరేకించాయి. బలపరీక్షకు ముందుగానే విజయ్, తమిళనాడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని డీఎంకే నేత ఉధయనిధి స్టాలిన్ ఆరోపించారు. 65 శాతం తమిళనాడు ఓటర్లు విజయ్‌కి వ్యతిరేకంగా ఓటు వేశారని పేర్కొన్నారు. తమ కూటమి పక్షాలతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారని విజయ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమిళనాడులో రీల్ ప్రభుత్వం కాకుండా రియల్ ప్రభుత్వం ఉండాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఓటింగ్‌కు దూరంగా ఉంటామని చెబుతూ 59 ఎమ్మెల్యేలు ఉన్న డీఎంకే వాకౌట్ చేసింది.

**తటస్థంగా బీజేపీ**

అయితే బీజేపీ మాత్రం ఈ ఓటింగ్‌లో 'తటస్థంగా' ఉండాలని నిర్ణయించింది. అన్బుమణి రామదాస్ నేతృత్వంలోని పీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు వెల్లడించింది. మరోవైపు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం విజయ్‌కు ఓటు వ్యతిరేకంగా ఓటు వేస్తామని ముందే చెప్పింది. విజయ్ ప్రభుత్వం తమ పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలకు డబ్బు ఆశ

మిగతా 4లో



## ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి

### -సీఎం చంద్రబాబు

**టీ మీడియా, మే 13 , అమరావతి బ్యూరో :** రాజధాని అమరావతిలో త్వరలోనే 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి రాబోతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. దీనికి ఎలాంటి అనుమతులు కావాలన్న త్వరగా ఇస్తామని వెల్లడించారు. మంగళగిరి మండలం నిడమర్రులో కిమ్స్ ఆస్పత్రి నిర్మాణానికి సీఎం చంద్రబాబు భూమిపూజ చేశారు. అనంతరం బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అమరావతిలో కిమ్స్ ఆస్పత్రి, స్కిల్ వర్సిటీకి 23 ఎకరాలను సీఆర్‌డీఏ కేటాయించింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్?, మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ గంటి హరీష్, పలువురు నేతలు పాల్గొన్నారు.అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యసేవలో లక్ష మంది సేవలు అందించే విధంగా తయారు చేయాలని, ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒక్కరు ఇక్కడి నుంచే ఉండాలని అన్నారు. అలానే 1000 మంది ట్రైనీలను సిద్ధం చేస్తామని వెల్లడించారు.

మిగతా 4లో

## శ్రీవాణి టికెట్లు హైజాక్ చేస్తున్న ఏజెంట్లు

**- సాఫ్ట్‌వేర్ గిమ్మిక్కులతో క్షణాల్లో బుకింగ్**

**టీ మీడియా, మే 13 , తిరుమల** : తిరుమల "శ్రీవాణి ట్రస్ట్"కు విరాళం ఇచ్చే వారికి కేటాయించే దర్శన టికెట్లు ఇప్పుడు ప్రైవేటు ట్రావెల్స్ సంస్థల చేతుల్లో బందీ అవుతున్నాయి. సాధారణ భక్తులు వెబ్‌సైట్‌లో వివరాలు నింపేలోపే హైటెక్ పరిజ్ఞానంతో ఏజెంట్లు హైజాక్ చేస్తున్నారు. ఒక్కో టికెట్‌పై రూ.3,000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇటీవలే ఈ అక్రమ ఉదంతం వెలుగులోకి రావడంతో టీటీడీ విజిలెన్స్? విభాగం రంగంలోకి దిగింది.

**బయటపడిన దందా**

ఈనెల 6న చెన్నైకి చెందిన ఇద్దరు భక్తులు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ దందా బయటపడింది. ఈ వ్యవహారంపై ఈనెల 7వ తేదీన తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రతిరోజు ఆన్‌లైన్‌లో 800 శ్రీవాణి టికెట్ల జారీ చేస్తున్నారు. వీటి బుకింగ్‌లో ప్రైవేట్ నెట్ సెంటర్లు, ఏజెంట్లు "ఆటోఫిల్లింగ్" తదితర థర్డ్ పార్టీ సాఫ్ట్‌వేర్లను వాడుతున్నట్లు గుర్తించారు.

**హైజాక్ చేస్తున్న ఏజెంట్లు**

అధికారిక వెబ్‌సైట్ పూర్తిస్థాయిలో లోడ్ కాకముందే ఈ టూల్స్ ద్వారా సమాచారాన్ని ఉపయోగించి సర్వర్‌లోకి పంపుతున్నారు. భక్తుల ఆధార్ వివరాలను ముందే సేకరించి సాఫ్ట్‌వేర్‌లో సిద్ధంగా



ఉంచడంతో సామాన్యుల కంటే వేగంగా వీరు బుకింగ్ పూర్తి చేస్తున్నారు. గతంలో రోజుకు 200 నుంచి 250 టికెట్లు ఇలాగే పక్కదారి పట్టినట్లు సమాచారం. వెబ్?సైట్ సర్వర్ ఎనేబుల్ అయిన వెంటనే ఈ స్థాయిలో అక్రమ బుకింగ్?లు జరగడం వెనుక ఐటీ విభాగంలోని కొందరి అంతర్గత సహకారం ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

దీనిపై ఎలక్ట్రానిక్ డేటా ప్రాసెసింగ్ విభాగానికి విజిలెన్స్ అధికారులు లేఖ రాశారు. ఒకే ఐపీ అడ్రస్ నుంచి, ఒకే మొబైల్ నంబరుపై పెద్ద సంఖ్యలో టికెట్లు బుక్ అయ్యాయా, ప్రైవేటు వ్యక్తులకు భక్తుల ఆధార్ డేటా ఎలా అందుతోంది,

మిగతా 4లో

## రూ.10 లక్షలు దాటితే నో గ్యాస్ సబ్సిడీ!



**-స్వచ్ఛందంగావదులుకున్న పలువురు**

**టీ మీడియా, మే 13 , హైదరాబాద్ బ్యూరో :** వార్షికాదాయం రూ.10 లక్షలు కన్న ఎక్కువ ఉన్నవారు గ్యాస్ సబ్సిడీకి అర్హులు కాదు. గ్యాస్ సబ్సిడీ పొందుతున్న గృహ వినియోగదారులకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు షాక్ ఇచ్చేలా ఉన్నాయి. కొన్ని రోజులుగా పన్ను వర్తించే వార్షికాదాయం రూ. 10 లక్షలు దాటిందని, దీంతో మీరు ఎల్పీజి సబ్సిడీకి అర్హులు కాదంటూ ఇండేన్, హెచ్?పీసీఎల్? వంటి ఆయిల్ కంపెనీల పేరుతో గ్యాస్ వినియోగదారుల ఫోన్లకు ఎస్?ఎంఎస్?లు వస్తున్నాయి.

**టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలంటున్న ఓఎంసీ**

ఆయిల్ కంపెనీలు ఫోన్?లకు పంపిన మెసేజ్?లపై ఏడు రోజులలోగా వివరణ ఇవ్వకపోతే గ్యాస్ సబ్సిడీని నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నాయి. ఓ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ (ఓఎంసీ) నుంచి పలువురు గ్యాస్ వినియోగదారులకు గ్రీవెన్స్ పోర్టల్?లో ఫిర్యాదు చేయాలనీ, లేదంటే 1800233555 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలని మే 10 నుంచే మెసేజ్?లు వస్తున్నాయి. కుటుంబంలో ఎవరికైనా పన్నువర్తించేలా వార్షికాదాయం రూ. పది లక్షల దాటితే గ్యాస్ సబ్సిడీకి అర్హులు కాదని అది చెబుతుంది. ఒకవేళ మీ కుటుంబ వార్షికాదాయం రూ.10 లక్షలు లేకపోతే మీరు ఇదే టోల్?ఫ్రీ నంబరును సంప్రదించవచ్చు. మీ సమస్యను చెప్పవచ్చు. అపుడు మీ గ్యాస్? సబ్సిడీకి అర్హత కోల్పోరు.

**ఆదాయపు పన్ను చెల్లించేవారికి సబ్సిడీ నిలిపివేత**

పశ్చిమాసియాలోని యుద్ధం వల్ల ఇతర దేశాల నుంచి జరిగే గ్యాస్? సరఫరాపై ప్రభావం పడింది. దీనివల్ల కమర్షియల్ గ్యాస్? ధరను మే 1 నుంచి ఆయిల్? మార్కెటింగ్ కంపెనీలు రూ.993 పెంచాయి. ఇలా 2026లో మొత్తం మూడుసార్లు పెంచాయి. పెరుగుతున్న నష్టాలను తగ్గించడానికి గ్యాస్? గృహ వినియోగదారుల్లో మొదట్లో ఆదాయపు పన్ను చెల్లించేవారికి సబ్సిడీని నిలిపివేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం వినియోగదారులకు డొమెస్టిక్ గ్యాస్? సిలిండర్లపై రూ. 40 సబ్సిడీ అందిస్తోంది.

**నేరుగా సబ్సిడీని ఆపేసేలా చర్యలు**

సబ్సిడీ నిలిపివేయడానికి ఓఎంసీలు ఐటీ రికార్డులను ఆధారంగా చేసుకుంటున్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం "గివ్ ఇట్ అప్" పేరుతో స్వచ్ఛందంగా వారే గ్యాస్ సబ్సిడీని వదులుకోవాలని కోరింది. దీనికి పలువురు సహకరించి సబ్సిడీని వదులుకున్నారు. అయితే ప్రస్తుతం ఆయిల్ కంపెనీలే నేరుగా సబ్సిడీని ఆపేసేలా చర్యలు తీసుకుంటున్నాయి.

మిగతా 4లో

# భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలి

**ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్**



**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :** యావత్తు తెలంగాణ సమాజాన్ని కుదిపేసిన ఫోక్సో కేసు రేవంత్ రెడ్డి, బండి.సంజయ్ చీకటి స్నేహం వల్లే బలహీనపడ్డది అని రాష్ట్ర బి.ఆర్.ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.బుధవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తో కలసి వారి స్వగృహంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూఅమ్మాయి కుటుంబంపై 308 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.308 క్లాజ్ 5 కిందికి రాదు.కేవలం అమ్మాయి కుటుంబంపై వేధింపుల కోసం తీవ్రమైన కేసు పెట్టారు.రేపులు, మర్డర్లు చేసే వ్యక్తులకు నోటీసులు ఇవ్వడం ఏ చట్టం ప్రకారము రేవంత్,డి.జి.పి చెప్పాలి.

బండి.సంజయ్ ఇల్లు ఎందుకు రైడ్ చేయడం లేదుఅసదుద్దీన్ ఓవైసీ మైనర్ బాలికపై అత్యాచారాన్ని ఖండించాలి.వక్ఫ్ బోర్డు చైర్మెన్ తప్పు చేస్తే కె.సి.ఆర్ పదవి నుండి తప్పించారు.కె.సి.ఆర్ తన సొంత కూతురును కూడా సహించలేదు గుర్తు పెట్టుకో.మీడియాను సంజయ్ గుప్పిట్లో పెట్టుకొని కొడుకును కాపాడే ప్రయత్నం చేస్తున్నాడు.డి.జి.పి,సి.పి,హైదరాబాద్,సి.పి కరీంనగర్ కి విజ్ఞప్తి చట్టాన్ని కాపాడండి.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూఅధికారంలో ఉంటే చట్ట వ్యతిరేకపనులుచేయవచ్చా.వ్యవస్థను బలహీనంగా చేయడం వల్ల సమాజం బలహీన పడుతుంది.చట్టానికి, రాజ్యాంగానికి కట్టుబడి పని చేయాలని ఉన్నత అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమములో బోలెమోని.లక్ష్మయ్య,గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్,మాజీ మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ సాయి కుమార్, సర్పంచ్ స్వప్న భాస్కర్,కౌన్సిలర్స్ సౌజన్య దిలీప్ రెడ్డి, ఏర్వ.అరుణా శ్రీనివాస్,శిరీష రమేష్ గౌడ్,మాజీ కౌన్సిలర్స్నందిమల్ల.శారద,జ్యోతి,మహిళా అధ్యక్షురాలు నాగమ్మ, కవితా నాయక్,పవిత్ర భాను,సరస్వతి,కర్రెస్వామి,సాయి కుమార్, రాజశేఖర్, వెంకట్ సాగర్, జోహెబ్ హుస్సేన్,హరిబాబు, నీలస్వామి,హేమంత్ ముదిరాజ్, చిట్యాల. రాము,మంద.రాము,న్యాయవాది రాజు, అనపాటి. రాము,పానుగంటి.విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## భజన లో మైకులు అందజేత



**టీ మీడియా ,మే 13, పెబ్బేరు** :ఇంటింటా భజన మన ఇంట్లో భజన కార్యక్రమంలో అయ్యప్ప స్వామి గుడి భక్తి సంస్కృతికి సనాతన ధర్మ సంప్రదాయాలను ప్రతి ఇంటికి చేరవేసే పవిత్ర యజ్ఞమని అయ్యప్ప మాల ధారణ గురుస్వాములు అన్నారు ఈ కార్యక్రమం ద్వారా చెడు అలవాట్లకు దూరంగా క్రమ శిక్షణ ఆధ్యాత్మిక చైతన్యం పెరుగుతుందని కుటుంబాల్లో శాంతి ఐక్యత భక్తి భావాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు భజన కార్యక్రమాలు మరింత ఘనంగా నిర్వహించేందుకు భజన బృందానికి అవసరమైన మైకు లను మేకల నాగరాజు గురు స్వామి అందజేయడం ఆనందంగా ఉందనీ గురుస్వాములు తెలియజేశారు భక్తి మార్గంలో నడవడం సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని మేకల నాగరాజు తెలిపారు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించి భజన సంప్రదాయాన్ని గ్రామ గ్రామాన విస్తరింపజేయాలని పెబ్బేరు అయ్యప్ప స్వామి భక్తులు భజన బృందం పిలుపునిచ్చారు.

## వడ్లు కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ ధర్నా



**టీ మీడియా,మే 13, పెబ్బేరు:** పెబ్బేరు పట్టణంలోనీ బస్టాండ్ దగ్గర ఉన్న మార్కెట్ యార్డు ముందు మెయిన్ రోడ్డు పై బైఠాయించి ధర్నాచేశారు రైతులు పండించిన వడ్లు కొనుగోలు సరిగా చేయటం లేదని కాశీటాలో ఎక్కువగా తరుగులు తీస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వి దిలీప్ కుమార్ రెడ్డి మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పేదింటి ఆడపిల్ల పెళ్లికి ఎమ్మెల్యే మేఘన్న పెళ్లి కానుక



**టీ మీడియా ,మే 13 ,పెబ్బేరు:** పెబ్బేరు మున్సిపాలిటీలో పేదింటి ఆడపిల్ల పెళ్లికి అండగా నిలబడాలనే సామాజిక బాధ్యతతో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ తమ సొంత ఖర్చుతో పేదింటి ఆడపిల్ల పెళ్లికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేరుతో మేఘన్న పెళ్ళికానుక రూ3 వేలు నూతన వస్త్రాలను మున్సిపాలిటీలోని 10వ వార్డులో మేకల సరోజ ఆంజనేయులు దంపతుల కూతురు నందిని పెళ్ళికి చైర్మన్ దంపతులు అక్కి సుశీల శ్రీనివాస్ గౌడ్ ఆర్థిక సాయం చేశారు పేదింటి ఆడపిల్ల పెళ్లికి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అందించిన మేఘన్న పెళ్లి కానుక ఆర్థిక సహాయం ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచింది మీ ఉదారతకు పేదల పట్ల మీకున్న మమకారానికి పెళ్లికూతురు నందిని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలుపుతూ మీ సేవలు ఇలాగే కొనసాగాలని కోరారు .ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ రాములు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలోవిద్యా వారోత్సవాలు



**టీ మీడియా, మే 13 ,పెబ్బేరు:** పెబ్బేరు పట్టణంలోనీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలు నిర్వహించారు .డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ విద్యార్థులను సన్మానించి అభినందించారు. కళాశాల అభివృద్ధి కార్యక్రమాలు తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.




# భగీరథ్ పరారీలో ఉన్నాడు

**- గోడపై దర్శనమిచ్చిన పోస్టర్లు**

**టీ మీడియా, మే 13 , హైదరాబాద్ బ్యూరో :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పరారీలో ఉన్నాడంటూ ఈరోజు ఉదయం వెలసిన పోస్టర్లు హైదరాబాద్?లో చర్చనీయాంశంగా మారాయి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ఉదయం ఈ తరహా పోస్టర్లు వెలిశాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్?కు వ్యతిరేకంగా ఉన్న ఈ పోస్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు అంటించడం కలకలం రేపింది.

**రాజకీయ వర్గాల్లో ఆసక్తి**

శేరిలింగంపల్లిలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలైన గచ్చిబౌలి ఫ్లై ఓవర్, నలగండ్ల ఫ్లై ఓవర్?తో పాటు మున్సిపల్? జోనల్ కార్యాలయ పరిసరాల్లో ఈ పోస్టర్లు దర్శనమిచ్చాయి. ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో బండి భగీరథ్? పరారీలో ఉన్నాడంటూ ఆ పోస్టర్లలో పెద్ద పెద్ద అక్షరాలతో రాశారు. పబ్లిక్ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈ స్థాయిలో పోస్టర్లు ఉండటంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అయితే, ఈ పోస్టర్లను ఎవరు అంటించారు? దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వీటిని తొలగించే ప్రక్రియను చేపట్టారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

**విచారణకు భగీరథ్ గైర్హాజరు**

పోలీసుల విచారణకు బండి భగీరథ్ హాజరుకాలేదు. పోక్సో కేసు విచారణ కోసం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని ఆయనకు పోలీసులు మంగళవారం నోటీసులు ఇచ్చారు. భగీరథ్ తన మైనర్? కుమార్తెను వేధిస్తున్నాడంటూ 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్లో ఈ నెల 8న(శుక్రవారం రాత్రి) పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.ఈ అంశంలో తెలంగాణలో రాజకీయంగా వివాదాలు కొనసాగుతున్నాయి. బండి భగీరథ్?ను వెంటనే అరెస్టు చేయాలంటూ కొన్ని మహిళా సంఘాలు పేట్? బషీరాబాద్? పోలీస్? స్టేషన్ ముందు ఆందోళన చేశారు. కొంతమంది మెట్రోలో పోస్టర్స్?ను చూపుతూ అతన్ని రిమాండ్?కు తరలించాలని డిమాండ్? చేశారు.

# 'చదువుల్లో సింగపూర్ బెస్ట్'

**- ప్రైవేటు స్కూళ్లలో చదవాలనుకుంటే**

**-ప్రభుత్వ అనుమతి తప్పనిసరి**

**టీ మీడియా, మే 13 , అమరావతి :** ఉపాధ్యాయులకు పటిష్ఠ శిక్షణ, ఒత్తిడి లేని తరగతులు. క్రిటికల్ థింకింగ్, డిజిటల్ అక్షరాస్యత ఇవి సింగపూర్ పాఠశాల విద్యావ్యవస్థ బలాలు. ఆ దేశంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలి. ఒకవేళ ఎవరైనా ప్రైవేటు స్కూళ్లలో చేరి చదువుకోవాలనుకుంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. మాతృభాషకు ఒక సబ్జెక్టుగా బోధిస్తారు.మన రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన 37 మంది 5 రోజుల పాటు సింగపూర్?లో పర్యటించారు. అక్కడి పాఠశాల విద్య విధానాలపై అధ్యయనం చేశారు. పలు పాఠశాలలను సందర్శించారు. విద్యా వ్యవస్థలోని అనేక అంశాల గురించి తెలుసుకున్నారు. అక్కడ శిక్షణ తరగతుల్లో పాల్గొని ఇటీవల తిరిగొచ్చారు. ఆ వివరాలను ఇక్కడి వారితో పంచుకున్నారు. సింగపూర్ విద్యావ్యవస్థకు సంబంధించిన మరిన్ని వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**బోధన వృత్తికి పెద్దపీట**

సింగపూర్?లో సైన్యం, వైద్యం తర్వాత ఉపాధ్యాయ వృత్తికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. నియామక ప్రక్రియ ఎంతో పకడ్బందీగా ఉంటుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు మారేందుకు వారికి ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తారు. ఫలితంగా బోధనలో నాణ్యత గణనీయంగా మెరుగుపడింది.

ఉపాధ్యాయుల పనితీరు ఆధారంగా వారికి గ్రేడ్‌లు ఇస్తారు. పదోన్నతులకు ఈ గ్రేడింగే ఏకైక ప్రామాణికం. అంతేకాకుండా, పదోన్నతి పొందిన తర్వాత 6 నెలల తప్పనిసరి శిక్షణ అవసరం.ప్రతి ఉపాధ్యాయుడూ ఏటా కనీసం 100 గంటలు తప్పనిసరిగా శిక్షణ పొందాలి.ఉపాధ్యాయులు కేవలం ఫెసిలిటేటర్లుగానే ఉంటారు. విద్యార్థులకు తెలిసిన విషయాల ద్వారా వారిని సబ్జెక్టులోకి తీసుకు వెళ్లే విధానంలో బోధన సాగుతోంది.

**విద్యార్థులకు గ్రేడింగ్**

పిల్లలకు మార్కులు ఉండవు. గ్రేడ్లు ఇస్తారు. వెనుకబడిన విద్యార్థులను వదిలేయరు. ఏ సబ్జెక్టులో వెనుకబడ్డారో దానిపై ప్రత్యేక దృష్టి పెడతారు.

ప్రతి ఒక్కరి వద్ద ల్యాప్?టాప్ ఉంటుంది. స్వయంగా పిల్లలే పవర్ పాయింట్ ప్రజెంటేషన్? లు చేస్తారు. వాటిని తరగతిలో ప్రదర్శిస్తారు.డిజిటల్ లెర్నింగ్?కు అధిక ప్రాధాన్యత ఇస్తారు. అదే విధంగా ఇంటి దగ్గర అభ్యసన కొనసాగుతుంది.

6 నుంచి 12 ఏళ్ల మధ్య ప్రాథమిక విద్య ఉంటుంది. ఆ తర్వాత పరీక్ష నిర్వహించి, గ్రేడ్ల ఆధారంగా విద్యార్థులను సెకండరీ విద్యకు పంపిస్తారు.

**పిల్లలకు ఒత్తిడి లేకుండా**

**డిజిటల్ లిటరసీలో** సింగపూర్ అగ్రగామిగా నిలుస్తోంది. పిల్లలకు పరీక్షలు తగ్గించి, ఒత్తిడి లేకుండా చేశారు. టర్మ్?లు పూర్తి అయ్యాక 10 రోజుల చొప్పున సెలవులు ఉంటాయి. టర్మ్?లో ఏ పాఠం ఎప్పుడైనా చెప్పొచ్చు. పూర్వ ప్రాథమిక విద్యలో నాణ్యమైన బోధనకు అధిక



ప్రాధాన్యత ఇస్తున్నారు. పసితనంలోనే చిన్నారులకు బలమైన పునాది వేస్తే ప్రాథమిక తరగతుల్లో ఏ విధమైన ఇబ్బందులు ఉండవని సింగపూర్?లో విద్యా వ్యవస్థ భావిస్తోంది.

**రాబోయే తరం విజయానికి మార్గదర్శకం**

ప్రభుత్వ వ్యూహాత్మక నిర్ణయాలు ఉపాధ్యాయుల నైపుణ్యాలను మెరుగు పరచడం ద్వారా ఈ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుంది. అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను తరగతి గదుల్లో ఏకీకృతం చేయడం ద్వారా విద్యా వ్యవస్థలో గుణాత్మక పరివర్తనకు మార్గం సుగమనం అవుతుంది. ప్రపంచ ప్రమాణాలతో ముందుకు సాగుతూ ఈ ప్రయత్నం రానున్న తరం విజయానికి మార్గదర్శకంగా నిలుస్తుంది.

# సబ్ -రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వీల్ చైర్ వితరణ

**బిజెపి రాష్ట్ర నాయకుడు మున్నూరు రవీందర్ దాతృత్వం**

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :** ఇటీవల వనపర్తి జిల్లా కేంద్రంలోని సమీకృత మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్–రిజిస్ట్రేషన్ కార్యాలయానికి బిజెపి రాష్ట్ర నాయకుడు సీనియర్ న్యాయవాది మున్నూరు రవీందర్ తన సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఉచితంగా వీల్ చైర్ బహుకరించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గతంలో వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రజలకు రైతులకు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు అందుబాటులో అసౌకర్యంగా నిత్యం రద్దీగా కొత్తకోట వెళ్లే రహదారిలో ఉన్న సబ్– రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఇటీవల వనపర్తి కొత్త బస్టాండ్ సమీపంలో గత టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన సమీకృత మార్కెట్ యార్డులో మొదటి అంతస్తు లో రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రారంభోత్సవం చేశారని అయినప్పటికీ మొదటి అంతస్థు లో సబ్– రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు ఇబ్బంది కలగకుండా ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, సీనియర్ సిటిజన్స్, తో పాటు అనారోగ్యంతో వివిధ రోగాలతో బాధపడుతున్న ప్రజల కోసం బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు న్యాయవాది మున్నూరు రవీందర్ తన సొంత ఖర్చులతో ఉచితంగా వీల్ చైర్ సబ్– రిజిస్ట్రార్ చంద్రశేఖర్ రెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా మున్నూరు రవీందర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో లేకుండా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుస్తున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంతభవనాలను ఎందుకు నిర్మించలేదని ఆయన ప్రశ్నించారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వనపర్తి జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో గుట్టలు, అడవులలో కార్యాలయా నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారని లక్షల రూపాయల డబ్బులతో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు వ్యాపారస్తులకు సెక్యూరిటీ లేక ఆ కార్యాలయం శంకుస్థాపనకి పరిమితమైందని అన్నారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్న సబ్ రిజిస్ట్రేషన్ సొంత కార్యాలయం నిర్మాణంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందినట్లు మున్నూరు రవీందర్ ఆరోపించారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోట సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయాలను నిర్మించిన ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎందుకు నిర్మించలేదని ఆయన ప్రశ్నించారు. అలాంటి సందర్భంలో గత్యంతరం లేక సమీకృత వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో సబ్ -రిజిస్ట్రేషన్ కార్యాలయం నిర్మించినప్పటికీ మొదటి అంతస్తు ఎక్కలేని వికలాంగులు వృద్ధులు సీనియర్ సిటిజన్ల కోసం వీల్ చైర్ ను తాను ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రజలకు





అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మున్నూరు రవీందర్ చేసిన కృషిని ప్రజలు అభినందించారు. ముఖ్యంగా వృద్ధులు వికలాంగులు సీనియర్ సిటిజన్లు మున్నూరు రవీందర్ అందించిన వీల్ చైర్ పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# ఐటీ కట్టకున్నా మద్యం దుకాణాలు ఎలా..?

**- బినామీలపై ఆదాయపన్నుశాఖ నజర్**

**-బినామీల బాగోతం బట్టబయలు**

**టీ మీడియా, మే 13 , హైదరాబాద్ బ్యూరో:** రాష్ట్రంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న లైసెన్సుదారుల ఆర్థిక స్థితిగతులపై ఆదాయపు పన్నుశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పన్ను చెల్లింపునకు నోచుకోని వారు కోట్లు వెచ్చించి మద్యం దుకాణాల లైసెన్సులు పొందడంపై ఆరా తీస్తోంది. ఐటీ అధికారుల పరిశీలనలో మద్యం వ్యాపారం పేరుతో బినామీల బాగోతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. దీంతో రాష్ట్రంలోని 2,620 మంది లైసెన్స్ దారుల ఆర్థిక పరిస్థితిపై నజర్‌పెట్టింది.రాష్ట్రంలో 2025–2027కి సంబంధించి 2వేల 620 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఇందులో గౌడ సామాజిక వర్గానికి 393, ఎస్సీలకు 262, ఎస్టీలకు 95 చొప్పున రిజర్వేషన్ కింద 786 దుకాణాలు కేటాయించారు. మరో 1,834 దుకాణాలు జనరల్ కేటగిరీకి కేటాయించారు. ఈ లైసెన్సుల వెనుక వేల కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయి. 2025–2027కి 2వేల 620 మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానించగా 95 వేల 600 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దుకాణానికి 3 లక్షల నాన్–రిఫండబుల్ రుసుము కింద ప్రభుత్వానికి ఏకంగా 2వేల 869 కోట్ల మేర ఆదాయం సమకూరింది. అదే విధంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా మొత్తం ఎక్సైజ్ ఆదాయం రికార్డు స్థాయిలో 40వేల209 కోట్లు వచ్చినట్లు అబ్కారీ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**6న తాత్కాలికంగా జప్తు**

రాష్ట్రంలోని 2వేల 620 మద్యం దుకాణాలను జనాభా ఆధారంగా ఆరు స్లాబుల కింద కేటాయించారు. రూ.50 లక్షల నుంచి రూ.కోటి 10 లక్షల వరకు లైసెన్స్ దారులు వ్యయం చేయాల్సి ఉంటుంది. అయితే లైసెన్సు దారులకు ఆ స్థాయిలో ఆర్థిక సామర్థ్యం నిజంగా ఉందా? అనే ప్రశ్న ఆదాయపు పన్ను శాఖ అధికారుల్లో అనుమానాలకు తావిస్తోంది. హైదరాబాద్ చందానగర్ గంగారంలోని భవానీ వైన్స్ పేరిట నడుస్తున్న మద్యం దుకాణాన్ని, దానికి అనుబంధంగా ఉన్న బ్యాంకు ఖాతాను ఈ నెల 6న ఐటీశాఖ తాత్కాలికంగా జప్తు చేసింది.

**బినామీలపై ఐటీ నజర్**

**ఈ దుకాణంలో** నెలకు 4 కోట్ల టర్నోవర్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణ రిటైల్ మద్యం విధానం ప్రకారం షెడ్యూల్డ్ కులాల పారిశ్రామికవేత్తలకు ప్రత్యేకంగా కేటాయించిన లైసెన్సు కింద చింతకింది సురేష్ అనే వ్యక్తి దుకాణానికి లైసెన్సు పొందారు. లైసెన్సు ఆయన పేరు మీద ఉన్నప్పటికీ పెట్టుబడి వేరొకరిది. నిర్వహణ మరొకరిది. ఇది బినామీ లావాదేవీల నిషేధచట్టం కింద స్పష్టమైన నేరమని అధికారులు భావిస్తున్నారు.

వివరాలను పరిశీలిస్తున్న అధికారులు : హైదరాబాద్‌లో బినామీ కేసు వెలుగులోకి రావడంతో రాష్ట్రంలోని అన్ని లైసెన్సుదారులపై ఆదాయపు



పన్ను శాఖ దృష్టి కేంద్రీకరించింది. ప్రస్తుతం 2,620 మంది లైసెన్సుదారుల బ్యాంకు లావాదేవీలు, ఆస్తి వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కోటా కింద లైసెన్సు పొందిన వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. లైసెన్సు పొందిన వారి ఆర్థిక వనరులు, వారి ఆదాయపు పన్ను ఫైలింగ్‌ను తనిఖీ చేస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా లైసెన్సు పొందిన వ్యక్తికి మెట్రో స్లాబ్ కింద రూ.కోటీ 10 లక్షల వార్షిక లైసెన్సు ఫీజు చెల్లించే స్థోమత ఉందా అనేది పరిశీలనలో కీలకాంశంగా మారింది.

# వచ్చే 3 రోజులు వర్షాలు..

**టీ మీడియా, మే 13 , హైదరాబాద్ బ్యూరో:** తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం కొనసాగుతోంది.. ఓ వైపు ఎండలు.. మరో వైపు వర్షాలు కురుస్తున్నాయి.. అయితే.. తీవ్రమైన ఎండల మధ్య వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. నైరుతి రుతుపవనాల పురోగమనం తోపాటు అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. 2026 మే 16వ తేదీ నాటికి దక్షిణ బంగాళాఖాత ప్రాంతం, అండమాన్ సముద్రం, అండమాన్ -- నికోబార్ దీవులలోని కొన్ని ప్రాంతాలపై నైరుతి రుతుపవనాల పురోగమనానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి.

నిన్నటి నైరుతి -- దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ–మధ్య బంగాళాఖాతంపై ఏర్పడిన అల్పపీడన ప్రాంతం, ఈ రోజు , 2026 మే 13వ తేదీన, భారత కాలమానం ప్రకారం ఉదయం 0830 గంటలకు అదే ప్రాంతంలో బాగా గుర్తించబడిన అల్పపీడన ప్రాంతంగా కొనసాగుతున్నది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీంతోపాటు ఉత్తర–దక్షిణ ద్రోణి నైరుతి మధ్యప్రదేశ్ నుండి మధ్య మహారాష్ట్ర, ఉత్తర అంతర కర్ణాటక మీదుగా దక్షిణ అంతర కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది.

**ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం**

బుధవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 30–40కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.




గురువారం, శుక్రవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 40–50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.

**దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్**

బుధవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 30–40కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.

గురువారం, శుక్రవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 40–50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.

**రాయలసీమ**

బుధవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 30–40కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.

గురువారం, శుక్రవారం తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 40–50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది.

**వాతావరణ హెచ్చరికలు**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ఈనెల 16 వ తారీఖు నాటికీ నైరుతి రుతుపవనాలు దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో అల్పపీడనం, ఉపరితల చక్రవాత ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాగల 3 రోజులకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి.బుధవారం, గ్నువారం, శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలోని ఒకటి రెండు తూర్పు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమేపి రెండు నుంచి నాలుగు డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది.

**వాతావరణ హెచ్చరికలు**

ఈరోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఉరుములు మెరుపులు, 30 నుండి 40 కిమీ వేగం కలిగిన ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి నుండి ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉంది.

# నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం ఘోర వైఫల్యం

## డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి



**టీ మీడియా,మే 13, వనపర్తి బ్యూరో :** నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం ఘోర వైఫల్యానికి ప్రధాని నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహించాలి అని తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి అన్నారు.దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్ర ఆందోళన వ్యక్తపరిచారు .నీట్, యుజీ 2026 ప్రశ్నాపత్రం మళ్లీ లీక్ కావడం దేశ విద్యా వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని పూర్తిగా దెబ్బతీసింది అని అన్నారు.మొన్న గుజరాత్, నిన్న బీహార్, నేడు రాజస్థాన్... ఇలా వరుసగా బీజేపీ పాలిత రాష్ట్రాలలో పేపర్లు లీక్ వ్యవహారాల్లో బయటపడటం యాదృచ్ఛికం కాదు. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఇది స్పష్టం చేస్తోంది అని అన్నారు.పరీక్షకు 48 గంటల ముందే 122 ప్రశ్నలు బయటకు వచ్చాయనే ఆరోపణలు అత్యంత ఆందోళనకరం. ప్రశ్నాపత్రాల భద్రతను కాపాడాల్సిన ఎన్టీఏ పూర్తిగా విఫలమైందని అనడానికి ఈ ఘటన రుజువు చేస్తోంది అని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి సిద్ధమవుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం వారి భవిష్యత్తును నిర్లక్ష్యానికి గురి చేస్తోంది.దేశ వ్యాప్తంగా కోట్లాది తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం ఆర్థిక, మానసిక ఒత్తిడిని భరిస్తున్నారు అని అన్నారు. ఇలాంటి సమయంలో పేపర్ లీకులు, పరీక్షల రద్దులు, పునఃపరీక్షలు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. "పరీక్ష రాయండి -- పేపర్ లీక్ అయితే మళ్లీ రాయండి" అనే పరిస్థితిని దేశ యువతపై బలవంతంగా మోపడం అన్యాయం అని,

11 ఏళ్ల బీజేపీ పాలనలో పేపర్ లీకులు సాధారణ ఘటనలుగా మారిపోయాయి అని ఆరోపించారు. ఉద్యోగ నియామక పరీక్షల నుంచి ప్రవేశ పరీక్షల వరకు ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యం మాత్రమే కనిపిస్తున్నాయి అని అన్నారు.నీట్ ప్రశ్నాపత్రం మళ్లీ లీక్ కావడంపై ప్రధాని నరేంద్రమోడీ నైతిక బాధ్యత వహించి దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి. కేంద్ర ప్రభుత్వం వెంటనే పారదర్శక దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వ్యవస్థను దేశ ప్రజలు ఇక సహించరు అని ఆదిత్య రెడ్డి అన్నారు.

# ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణ స్కామ్?..

### -అమెరికాలో 10 వేల మంది విదేశీ విద్యార్థులపై దర్యాప్తు!

### -భారతీయులకు నష్టమేంటి?

**టీ మీడియా, మే 13 , న్యూఢిల్లీ బ్యూరో :** అమెరికాలో విదేశీ విద్యార్థులకు ఉద్యోగ అనుభవం కల్పించే ఇమ్మిగ్రేషన్ మరియు కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలోని దర్యాప్తు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. అమెరికా ప్రభుత్వం నిర్వహిస్తున్నఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణ ప్రోగ్రామ్‌ను దుర్వినియోగం చేసినట్లు అనుమానిస్తూ దాదాపు 10 వేల మంది విదేశీ విద్యార్థులను గుర్తించినట్లుఐ సి ఇ ప్రకటించింది. వీరిలో భారతీయ విద్యార్థులు కూడా ఉన్నారని అమెరికా అధికారులు తెలిపారు.

**ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణ అంటే ఏమిటి?**

ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణఅనేది అమెరికాలో ఫీ-1 స్టూడెంట్ వీసాపై చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థులకు తమ విద్యా రంగానికి సంబంధించిన ఉద్యోగాల్లో తాత్కాలికంగా పనిచేసే అవకాశం ఇచ్చే ప్రోగ్రామ్. సాధారణంగా ఇది 12 నెలలపాటు ఉంటుంది. స్టెమ్ కోర్సులు చేసిన వారికి అదనంగా 24 నెలల పొడిగింపు లభిస్తుంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా అనేక మంది విద్యార్థులు తరువాత ఎ-1దీ ఉద్యోగ వీసాలకు మారే అవకాశం పొందుతున్నారు.

**ఐసిఇ ఆరోపణలు ఏమిటి?**

అమెరికా యాక్టింగ్ డైరెక్టర్ ప్రకారం ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణ వ్యవస్థ "మోసాలకు కేంద్రంగా మారింది". అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అనేక అనుమానాస్పద అంశాలు బయటపడ్డాయని చెప్పారు.

**దర్యాప్తులో బయటపడిన ప్రధాన అంశాలు**

విద్యార్థులు పనిచేస్తున్నట్లు చూపిన కంపెనీలు వాస్తవానికి లేకపోవడం

ఖాళీ భవనాలు, మూసివేసిన కార్యాలయాలను ఉద్యోగ సంస్థలుగా నమోదు చేయడంఒకే చిరునామాలో అనేక కంపెనీలు పనిచేస్తున్నట్లు చూపించడం

అమెరికాలో శిక్షణ పొందాల్సిన విద్యార్థులను భారత్ నుంచే "మేనేజ్" చేయడం

షెల్ కంపెనీల ద్వారా ఉద్యోగాలు చూపించి వీసా నిబంధనలు ఉల్లంఘించడం

ఐ సి ఇ ప్రకారం, ఇప్పటివరకు పరిశీలించిన టాప్ 25 ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణ ఉద్యోగ సంస్థల్లోనే 10 వేల మందికి పైగా విద్యార్థులు అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**జాతీయ భద్రతా ఆందోళనలు**

అమెరికా అధికారులు ఈ వ్యవహారాన్ని కేవలం వీసా మోసం కోణంలో మాత్రమే కాకుండా జాతీయ భద్రతా సమస్యగా కూడా చూస్తున్నారు. ఐ సి ఇ ప్రకారం కొన్ని కేసుల్లో: మేధో సంపత్తి దోపిడీ, ఉద్యోగ మోసాలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకున్న స్కామ్‌లు, బయోలాజికల్ బెదిరింపులు, గూఢచర్యం వంటి ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు.

**భారతీయ విద్యార్థులపై ప్రభావం?**

అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణ ద్వారా ఉద్యోగ అనుభవం పొందుతున్నారు. అందువల్ల తాజా పరిణామాలు భారతీయ విద్యార్థుల్లో ఆందోళనకు దారితీశాయి. ముఖ్యంగా కన్సల్టెన్సీల ద్వారా ఉద్యోగాలు పొందిన విద్యార్థులపై కఠిన పరిశీలన ఉండే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణ దరఖాస్తులపై కఠిన తనిఖీలు**

ఉద్యోగ సంస్థలపై భౌతిక ధృవీకరణ,ఫేక్ ఎంప్లాయర్‌లపై క్రిమినల్ చర్యలు,

వీసా రద్దులు, డిపోర్టేషన్ అవకాశాలు పెరగవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అమెరికా ప్రభుత్వం తదుపరి చర్యలుహోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం, ఐ సి ఇ సంయుక్తంగా ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణ వ్యవస్థను మరింత కఠినతరం చేసే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు సంకేతాలు ఇచ్చాయి. భవిష్యత్తులో:




**ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణ ఎంప్లాయర్ వెరిఫికేషన్ వ్యవస్థ బలోపేతం**

రిమోట్ మేనేజ్‌మెంట్‌పై పరిమితులు,విదేశీ ఆధారిత కన్సల్టెన్సీలపై నిఘా,

ఎ-1దీ మార్పిడి ప్రక్రియపై అదనపు పరిశీలన ఉండే అవకాశం ఉంది.

ఇక, అమెరికాలో విదేశీ విద్యార్థులకు కీలక అవకాశంగా భావించే ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణ ప్రోగ్రామ్ ఇప్పుడు భారీ దర్యాప్తు కేంద్రంగా మారింది. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై ఈ పరిణామాలు ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా భారతీయ విద్యార్థులు చట్టబద్ధమైన ఉద్యోగ సంస్థలతోనే పనిచేయాలని, వీసా నిబంధనలను కచ్చితంగా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.



# కాన్వాయ్‌ను సగానికి తగ్గించిన ప్రధాని మోదీ!

**- ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించాలని ఆదేశం**

**టీ మీడియా, మే 13 , న్యూఢిల్లీ బ్యూరో :** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశ ప్రజలకు ఇంధన పొదుపుపై పిలుపునిచ్చిన ప్రధాని మోదీ ఇప్పుడు అదే విషయాన్ని స్వయంగా ఆచరణలో పెట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తన అధికారిక కాన్వాయ్‌లో వినియోగించే వాహనాల సంఖ్యను 50 శాతం వరకు తగ్గించాలని ప్రధాని ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల దేశ ప్రజలకు ఇంధన వినియోగాన్ని తగ్గించాలని, అవసరమైన చోట మాత్రమే వాహనాలను ఉపయోగించాలని ప్రధాని సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రధాని తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించాలని స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ) అధికారులకు సూచించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

**భద్రతకు భంగం లేకుండా ఏర్పాట్లు**

అంతే కాకుండా కాన్వాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత పెంచాలని కూడా ఆదేశించినట్లు తెలుస్తోంది. దీని కోసం కొత్తగా ఎలాంటి వాహనాలను కొనుగోలు చేయకూడదని ఎస్?పీజీకి స్పష్టం చేసినట్లు సమాచారం. ప్రధానమంత్రి భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ఈ మార్పులు చేపడుతున్నట్లు ఎస్పీజీ వర్గాలు తెలిపాయి. కాన్వాయ్ పరిమాణం తగ్గించినప్పటికీ, తమ మార్గదర్శకాల ప్రకారం అన్ని కీలక భద్రతా ఏర్పాట్లు యథాతథంగా కొనసాగుతున్నాయని వెల్లడించాయి.

**మోదీ బాటలోనే అమిత్ షా, సీఎంలు**

ఇదిలా ఉండగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మధ్యప్రదేశ్? ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, దిల్లీ సీఎం రేఖా గుప్తా కూడా ప్రధాని బాటలోనే నటుస్తునట్లు సమాచారం. హోం మంత్రి అమిత్ షా తన కాన్వాయ్?ను సగ్గానికి పైగా తగ్గించారు. మోహన్? యాదవ్? తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు అమల్లో ఉండే పొదుపు చర్యల్లో భాగంగా, తన కాన్వాయ్‌లో గతంలో ఉన్న 13 వాహనాలకు బదులుగా కేవలం ఎనిమిది మాత్రమే ఉండాలని ఆదేశించినట్లు సమాచారం.

ప్రధానమంత్రి గారి దార్శనికత భారత్?ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే కాకుండా, వనరుల వినియోగంపై సున్నితత్వాన్ని పెంపొందించాలని కూడా లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దార్శనికతను అంతర్గతంగా స్వీకరించి, దిల్లీ ప్రభుత్వం ఇకపై వృధా ఖర్చులను అరికడుతుంది. ప్రజా నిధులు అభివృద్ధి కోసమే కానీ విలాసాల కోసం కాదని ప్రభుత్వ యంత్రాంగం అర్థం చేసుకోవాలి."

అయితే ఈ పొదుపు కోసం అత్యంత ముఖ్యమైన అంశం కార్‌పూలింగ్, ప్రజా రవాణాను ప్రోత్సహించడం. ఒకే మార్గంలో ప్రయాణించే లేదా ఒకే సమావేశానికి హాజరయ్యే అధికారులు వేర్వేరు వాహనాలను ఉపయోగించడం కంటే కార్‌పూలింగ్‌ను ఎంచుకోవాలని దిల్లీ ప్రభుత్వం కోరింది. అంతేకాకుండా, సాధ్యమైనంత వరకూ దిల్లీ మెట్రో లేదా ఇతర ప్రజా రవాణా మార్గాలను ఉపయోగించుకోవాలని అధికారులను ప్రోత్సహిస్తున్నారని రేఖ తెలిపారు.

దిల్లీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రెండు రకాల ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు భావిస్తున్నారు. రోడ్లపై ప్రభుత్వ వాహనాల సంఖ్య తగ్గడం వల్ల కర్బన ఉద్గారాలు తగ్గుతాయి. తద్వారా దిల్లీ గాలిని శుభ్రంగా ఉంచడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా, వీఐపీల రాకపోకలు, ప్రభుత్వ వాహనాల భారీ కాన్వాయ్‌ల వల్ల తరచుగా ఏర్పడే ట్రాఫిక్ జామ్‌ల నుంచి సాధారణ ప్రజలకు ఉపశమనం లభిస్తుందని అన్నారు. తమతమ శాఖల్లోని ప్రస్తుత వాహనాల సంఖ్యను తక్షణమే సమీక్షించి, వాటి వినియోగాన్ని అంచనా వేయాలని ముఖ్యమంత్రి అన్ని శాఖాధిపతులను ఆదేశించారు.

**పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించాలి**

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఖర్చులు, అంతరాయాల ప్రభావాన్ని ప్రస్తావించిన ప్రధాని మోదీ, ప్రజారవాణా, కార్‌పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్‌పై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా దేశ ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేయవచ్చని పేర్కొన్నారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలంటే వంటనూనె వినియోగాన్ని కూడా తగ్గించాలని ప్రధాని సూచించారు. విదేశీ మారకద్రవ్యాన్ని పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొంటూ, ప్రతి కుటుంబం వంటనూనె వినియోగాన్ని తగ్గిస్తే అది దేశానికి గొప్ప సేవ అవుతుందని చెప్పారు. ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు ఆపేయాలని చెప్పారు. "దేశభక్తి అంటే కేవలం సరిహద్దులో ప్రాణత్యాగానికి సిద్ధపడటం మాత్రమే కాదు. ఈ రోజుల్లో బాధ్యతాయుతంగా జీవిస్తూ, దేశం పట్ల మన కర్తవ్యాలను నెరవేర్చడమే నిజమైన దేశభక్తి. రసాయన ఎరువుల దిగుమతులపై కూడా దేశం భారీగా ఖర్చు చేస్తోంది. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయం వైపు మళ్లాలి. సహజ వ్యవసాయం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుంది." అని అన్నారు.



## నీట్‌కు ఆన్‌లైన్ పరీక్షే పరిష్కారం

**- తప్పదంటున్న నిపుణులు**

**టీ మీడియా, మే 13 , హైదరాబాద్ బ్యూరో :** నీట్ ప్రశ్నపత్రాలు లీక్‌లు లేకుండా పరీక్ష సాఫీగా జరగాలంటే జేఈఈ మెయిన్ తరహాలోనే ఆన్?లైన్? విధానంలో నిర్వహిస్తే ఇలాంటి తిప్పలు తప్పుతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇంతకంటే మరో మార్గం లేదని తేల్చి చెబుతున్నారు. దేశవ్యాప్తంగా ఒకటే పరీక్ష, ఎక్కడ లీకైనా లక్షల మంది విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. దేశంలో ఉన్న ఎంబీబీఎస్? సీట్లు తక్కువ, లక్షల్లో పోటీ, ఒక మార్కు తేడాతో ర్యాంకులే మారిపోతాయి. ఇకపై ఇలాంటి పరిస్థితి ఎదురవ్వకుండా ఉండాలంటే నేషనల్? స్థాయి పరీక్షల మాదిరిగానే కంప్యూటర్? బేస్డ్? టెస్ట్? విధానంలో పరీక్ష నిర్వహించడం మంచిదని నిపుణులు అంటున్నారు.

**కేంద్రం కసరత్తు చేసినా ఉపయోగం లేదు**

గతంలో కేంద్ర ప్రభుత్వం నీట్? రద్దు నేపథ్యంలో ఇస్రో మాజీ ఛైర్మన్? కస్తూరిరంగన్? ఛైర్మన్?గా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. అప్పుడు ఆ కమిటీ కూడా నీట్? పరీక్షను ఆన్?లైన్? విధానంలో నిర్వహించాలని సిఫార్సు చేసింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా ఆన్?లైన్? పరీక్షల కోసం ఏ రాష్ట్రంలో ఎన్ని పరీక్ష కేంద్రాలున్నాయి? అక్కడ సీటింగ్? సామర్థ్యంపై 2024 డిసెంబరులో రాష్ట్రాల ఉన్నత విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్? సైతం నిర్వహించారు. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని పరీక్ష కేంద్రాలను ఎక్కువగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పుడు అంతలా కమిటీ సిఫార్సుపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేసినా కారణాలు ఏంటో తెలియదు గానీ, నీట్? పరీక్ష మాత్రం గతంలో మాదిరిగానే ఆఫ్?లైన్?లోనే నిర్వహించారు. తాజాగా దాని ఫలితమే మళ్లీ ప్రశ్న పత్రం లీకై పరీక్ష రద్దు చేయాల్సిన పరిస్థితి ఎదురైంది.

**ఈ లీక్?లకు ఇప్పుడు పరిష్కార మార్గం ఆన్‌లైనే**

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆన్?లైన్? విధానంలోకి మారక తప్పదంటున్న నిపుణులు. లేదంటే ఎక్కడోచోట ప్రశ్నపత్రాల లీకుల వల్ల లక్షల మంది విద్యార్థులు ఈ సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పత్రాలు పంపాల్సి ఉండటంతో ఆ క్రమంలో లీకయ్యే అవకాశం అధికంగా ఉంది. అదే ఆన్?లైన్?లో అయితే ఈ సమస్యే ఉండదు. షిఫ్టులు పెంచి ప్రశ్నపత్రాలను నార్మలైజేషన్? విధానం అమలు చేయాల్సిందేనని భావిస్తున్నారు. అది ఇంటర్నేషనల్? స్థాయిలో ఎన్నో ఏళ్లుగా అమల్లో ఉంది. ఆఫ్?లైన్?లో నాలుగైదు ప్రశ్నపత్రాలను సిరీస్?? రూపంలో ఇస్తున్నారు.

**ఏకకాలంలో 40 వేల మంది రాసే అవకాశం**

అదే ఆన్?లైన్?లో ఎన్ని ప్రశ్నపత్రాలైనా రూపొందించుకోవచ్చు. ఎప్?సెట్?లో ప్రశ్నపత్రాన్ని కఠినం, మధ్యస్థం, సులభం అనే మూడు రకాల ప్రశ్నలు ఇస్తున్నారు. కాపీయింగ్?కు అవకాశం లేకుండా ప్రశ్నలతో పాటు ఎంపికల క్రమాన్ని కూడా జంబ్లింగ్? చేసే వెసులుబాటు ఆన్?లైన్?లో ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో 40వేల మంది ఏకకాలంలో పరీక్ష రాసే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి సర్కారు విద్యాసంస్థల్లో పరీక్షల సీటింగ్? సామర్థ్యాన్ని పెంచుకుంటే ఒకటి, రెండు విడతల్లో పూర్తవుతుందని నిపుణులు భావిస్తున్నారు.



## కురుమూర్తి దేవస్థాన చైర్మన్‌గా బత్తుల బాలరాజ్ ప్రమాణ స్వీకారం

**టీ మీడియా, మే 13, చిన్నచింతకుంట :**శ్రీ శ్రీ శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని, నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బత్తుల బాలరాజ్తో పాటు పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తి స్వామి దేవస్థానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఎలివేటెడ్ కారిడార్‌తో కూడిన ఘాట్ రోడ్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రూ.110 కోట్లు మంజూరు చేశారని, పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా దేవస్థానంలో కాటేజీలు, కళ్యాణ మండపం తదితర అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలను సంప్రదిస్తున్నామని, స్నేహ కంపెనీ సహకారంతో మహా మండప నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి దేవస్థానాన్ని యాదగిరిగుట్ట తరహాలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తి స్వామి మహిమాన్వితమైన దేవుడని, భక్తుల కోరికలు నెరవేరుతాయని అన్నారు. దేవుడి ఆశీస్సులతో పలుమార్లు ఆలయాన్ని దర్శించుకునే అవకాశం కలిగిందని, నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్ రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, సర్పంచులు, మండల కాంగ్రెస్ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం విజయ్ కీలక నిర్ణయం..

**ఓఎస్‌డి రికీ రాధన్ పండిట్ వెట్రివేల్ నియామకం రద్దు**

**టీ మీడియా, మే 13 , చెన్నై :**ఎక్కడ తగ్గాలో తనకు తెలుసు అని తమిళనాడు సీఎం విజయ్ చాటిచెప్పారు. తనకు బాగా సన్నిహితుడైన రాధన్ పండిట్ విషయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. రాధన్ కేవలం జ్యోతిష్యుడేగాదు, టి వి కె పార్టీ సభ్యుడు కూడా. ఆయన్ను తన ఓ ఎస్ డి గా నియమించారు విజయ్. అయితే ఈ నియామకంపై విమర్శలు రాగానే, వెనక్కి తగ్గారు. అసెంబ్లీలోనే మిత్రపక్షాలు నిలదీస్తే, ఈ అంశాన్ని పరిశీలిస్తామన్నారు. వెంటనే నిర్ణయం ప్రకటించారు.ఓ ఎస్ డి రికీ రాధన్ పండిట్ వెట్రివేల్ నియామకం రద్దు చేస్తూ.. తాజాగా టి వి కె సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.మే 12న జారీ చేసిన నియామక ఉత్తర్వులను.. మే 13న ప్రభుత్వం అధికారికంగా వెనక్కి తీసుకుంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన నోట్ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తమిళనాడు రాజకీయ వర్గాల్లో ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. తాను ఎలాంటి బేషజాలకు పోను అని.. విపక్షాల సూచనలు స్వీకరిస్తానని ఈ నిర్ణయంతో విజయ్ చెప్పకనే చెప్పారు.

**బల పరీక్షలో నెగ్గిన విజయ్ సర్కార్..**

బలపరీక్షలో నెగ్గిన తమిళనాడు సీఎం విజయ్ నెగ్గారు. ఆయనకు మద్దతుగా 144 మంది ఓటు వేయగా.. వ్యతిరేకంగా 22 మంది నిలిచారు. విజయ్‌కి మద్దతుగా 25మంది ఎ డి ఎం కె చీలిక వర్గం ఎమ్మెల్యేలు ఓటేశారు. ఓటింగ్‌కి ముందే సభ నుంచి డి ఎం కె వాకౌట్ చేసింది. విజయ్ ప్రభుత్వానికి కాంగ్రెస్,వి సి కె, సిపిఐ, సిపిఎం, ఐయుఎంఎల్ మద్దతు తెలిపాయి.తమది ప్రజా ప్రభుత్వం.. ప్రజాపాలన అన్నారు సీఎం విజయ్. తమది బలహీన వర్గాల ప్రభుత్వం.. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందన్నారు. తమ ప్రభుత్వంలో అందరికి సమాన అవకాశాలు ఉంటాయన్నారు. తమపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మూడేళ్లలోనే 34.92 శాతం



ఓటింగ్ సాధించామని.. అధికారంలో ఉన్నామని ఎవరినీ బెదిరించమన్నారు. తమ ప్రభుత్వంలో సాహసంతో కూడిన నిర్ణయాలుంటాయన్నారు.

అసెంబ్లీలో సీఎం విజయ్‌పై ఘాటు విమర్శలు చేశారు డి ఎం కె ఉదయనిధి స్టాలిన్. 65 శాతం ప్రజలు.. విజయ్‌ని తిరస్కరించారన్నారు. మెజారిటీ తమిళ ప్రజలు.. విజయ్‌కి ఓటేయలేదన్నారు ఉదయనిధి. విజయ్‌కి ప్రజల విశ్వాసం దక్కలేదు.. అందుకే టి వి కె కి మ్యాజిక్ ఫిగర్ రాలేదన్నారు. తప్పుడు హామీలతో ప్రజలను విజయ్ మోసం చేశారని విమర్శించారు. విజయ్‌కి ఓటు ఎందుకు వేశామోనని ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారన్నారు. పుష్ప సినిమా స్టైల్లో విజయ్ పాలన సాగుతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉదయనిధి. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలను విజయ్ కలవడం మంచి రాజకీయం కాదన్నారు. సీఎం విజయ్‌పై ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయని.. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలను కలవడంతో అది నిజమే అనిపిస్తోందన్నారు. ఇక, విశ్వాస పరీక్షలో తాము పాల్గొనడం లేదన్న ఉదయనిధి.. సభ నుంచి వాకౌట్ చేశారు.


# బీహార్ సాల్వర్ గ్యాంగ్ 'నీట్' కుట్ర..

### -ప్రవేశ పరీక్షలపై మాఫియా నీడలు

**టీ మీడియా, మే 13 , పాట్న:** పోలీసుల సమాచారం ప్రకారం.. ఈ ముఠా నీట్ అభ్యర్థుల స్థానంలో "సాల్వర్లు" అనే నకిలీ పరీక్షార్థులను పంపించి పరీక్షలు రాయించే వ్యవస్థను నడుపుతోంది. లక్షల రూపాయల ఒప్పందాలతో విద్యార్థులు లేదా వారి కుటుంబాల నుంచి డబ్బులు తీసుకుని, పరీక్ష కేంద్రాల్లో నకిలీ గుర్తింపులతో ప్రవేశం కల్పించేలా పథకం రచించినట్లు విచారణలో బయటపడింది. ఈ వ్యవహారంలో ఒక ఎంబీబీఎస్ విద్యార్థి కూడా కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు తెలిపారు.నలందలో జరిగిన దాడుల్లో నిందితుల వద్ద నుంచి నకిలీ అడ్మిట్ కార్డులు, ఆధార్ కార్డులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, అభ్యర్థుల ఫోటోలు, అలాగే లక్షల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. కొందరు అభ్యర్థుల వివరాలు, పరీక్షా కేంద్రాల సమాచారం, చెల్లింపుల రికార్డులు కూడా పోలీసుల చేతికి చిక్కినట్లు సమాచారం. దీనితో ఈ ముఠా కార్యకలాపాలు ఒక్క రాష్ట్రానికే పరిమితం కాకుండా, ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసు నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు, సైబర్ వి బ , ా గ ా ల ు అప్రమత్తమయ్యాయి. దేశవ్యాప్తంగా నీట్ మాఫియా కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు సమాచారం. ముఖ్యంగా గతంలో కూడా ప్రశ్నాపత్రాల లీకులు, సాల్వర్ గ్యాంగ్‌లు, నకిలీ అభ్యర్థుల వ్యవహారాలు



వెలుగులోకి రావడంతో, ఈసారి పరీక్షా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.ఈ ఘటన విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించింది. "నిజాయితీగా చదివే విద్యార్థుల భవిష్యత్తుతో మాఫియా ఆటలాడుతోంది" అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా నీట్ పరీక్షల విశ్వసనీయతపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. కొందరు పరీక్షా విధానంలో సాంకేతిక భద్రతను మరింత పెంచాలని కోరుతుండగా, మరికొందరు కేంద్ర స్థాయి పరీక్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణలు అవసరమని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే పలువురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఈ ముఠాకు దేశవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్‌పై లోతైన విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముందని అధికార వర్గాలు చెబుతున్నాయి. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే వైద్య విద్య ప్రవేశ పరీక్షల చుట్టూ మళ్లీ మాఫియా నీడలు కనిపించడం విద్యా వ్యవస్థకు పెద్ద సవాలుగా మారింది.



## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

**టీ మీడియా, మే 13 ,ఆత్మకూరు:**వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో పెద్దమ్మతల్లి ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ప్రతి గ్రామంలో గ్రామ దేవతలు ఉన్నారు పేరు ఒక్కటే మారుతుంది. గ్రామ దేవతల పరిధి గ్రామం మొత్తం ఉంటుంది. గ్రామ దేవత అమ్మవారి ప్రతిరూపమేనని, గ్రామ దేవతలను పూజిసించడం వల్ల గ్రామానికి ప్రజలకు మంచి జరుగుతుందని కమలానంద స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణ మహిళలు పెద్దలు యువకులు అందరూ పాల్గొని పెద్దమ్మ తల్లికి విశిష్ట పూజలు చేశారు. మహిళలు పెద్దమ్మ తల్లికి వడి బియ్యం సమర్పించి పెద్దమ్మ తల్లి ఆశీస్సులు తీసుకున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలోని పెద్దమ్మ గుడి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి మంత్రి వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు మంత్రి వాకిటి శ్రీహరి కి శాలువా, పూలమాలలతో స్వాగతం పలికి సన్మానించారు. వి ఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి , బిజెపి రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వంతెన పనులు పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి

**టీ మీడియా, మే 13 ,ఆత్మకూరు:**వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం జూరాల వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి రానున్న కొద్ది రోజుల్లో ఆత్మకూరు పట్టణానికి మహర్దశ పట్టనుందని తెలిపారు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి . జూరాల వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా 123 కోట్ల తో కృష్ణా నదిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న పనుల నాణ్యతను మంత్రి పరిశీలించారు.ఆత్మకూరు ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుందని మంత్రి తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే గద్వాల ఆత్మకూర్ మున్సిపాలిటీల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఈ వర్షాకాలం లోపు పిల్లర్ నిర్మాణాలు పూర్తయి ఏడాది లోపు వంతెన ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. హైదరాబాద్ మీదుగా వయా ఆత్మకూరు గద్వాల్,రాయచూరు నుండి మంత్రాలయం వరకు దాదాపు 60 కిలోమీటర్ల దూరం తక్కువ అవుతుందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఆత్మకూరు ఇకపై కనెక్టివిటీ మున్సిపాలిటీ అవుతుందని మంత్రి శ్రీహరి స్పష్టం చేశారు.





# నగర వాసులకు గుడ్ న్యూస్..

**-అందుబాటులోకి మరో ఫ్లై ఓవర్**

**టీ మీడియా, మే 13 , బాచుపల్లి :**ఆధ్వర్యంలో నిర్మించిన బాచుపల్లి జంక్షన్ ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయగా.. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. వేగంగా విస్తరిస్తున్న బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు ఇది ప్రధాన పరిష్కారంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు.గత కొన్నేళ్లుగా బాచుపల్లి జంక్షన్ పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందడంతో వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో మియాపూర్, గాజులరామారం, నిజాంపేట్, బౌరంపేట్ వైపు వెళ్లే వాహనాలతో జంక్షన్ తీవ్ర రద్దీగా మారేది. కొన్నిసార్లు వాహనాలు దాదాపు అరగంట పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయే పరిస్థితులు నెలకొన్నాయి.ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల మేరకు మూడు సంవత్సరాల క్రితం హెచ్ఎండీఏ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించింది. సుమారు 1.3 కిలోమీటర్ల పొడవుతో ఆరు లేన్లుగా ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.141 కోట్లను మంజూరు చేయగా.. అందులో సుమారు రూ.71 కోట్లు ఫ్లైఓవర్ నిర్మాణానికి వినియోగించారు. మిగతా నిధులను భూసేకరణ, ఇతర అనుబంధ పనుల కోసం ఖర్చు చేశారు.ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే మియాపూర్-గండిమైసమ్మ మార్గంలో ట్రాఫిక్ ఒత్తిడి చాలా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే నిజాంపేట్, మల్లంపేట్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలు కూడా మరింత సులభం కానున్నాయి. కొత్తగా రూపుదిద్దుకున్న జంక్షన్‌తో బాచుపల్లి ప్రాంత ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తగ్గనున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బలపరీక్షలో నెగ్గిన విజయ్

చూపి ఆకర్షించే ప్రయత్న చేసిందని ఆరోపించారు. మరోవైపు అన్నాడీంకే షణ్ముగం వర్గం పళనిస్వామి వ్యాఖ్యలను ఖండించింది. 25 మంది షణ్ముగం వర్గం ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు.

**మద్దతిచ్చిన వారికి విజయ్ కృతజ్ఞతలు**

చర్చ అనంతరం టీవీకే ప్రభుత్వానికి మద్దతిచ్చిన అందరికీ విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రభుత్వం పూర్తి ఐదేళ్ల కాలం పాలిస్తుందని విజయ్ ధీమా వ్యక్తం చేశారు. టీవీకే ప్రభుత్వం సంపూర్ణ లౌకిక విధానాన్ని అవలంబిస్తుందని విజయ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హామీలను కూడా కొనసాగిస్తామని చెప్పారు. టీవీకే ప్రభుత్వం ఓటు వేయనివారిది కూడా అని విజయ్ పేర్కొన్నారు.

**టీవీకే ఎమ్మెల్యేకు సుప్రంకోర్టులో ఊరట**

ఇదిలా ఉండగా, ఒక్క ఓటు తేడాతో గెలిచిన టీవీకే ఎమ్మెల్యే శ్రీనివాస సేతుపతికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఫ్లోర్? టెస్ట్?లో పాల్గొనకూడదని మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తమిళనాడు అసెంబ్లీలో ఓటు హక్కు వినియోగానికి అవకాశం కల్పించింది.

## రూ.10 లక్షలు దాటితే నో గ్యాస్ సబ్సిడీ!

**వీరి రేషన్‌కార్డులు తొలగింపు**

కేంద్ర ప్రభుత్వం కొంతకాలం క్రితమే ఆదాయపు పన్ను చెల్లిస్తూ రేషన్? పొందుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆదాయపు పన్ను చెల్లించే సమాచారాన్ని రేషన్ కార్డుదారుల ఆధార్ సంఖ్య, ఈకేవైసీ వివరాలతో విశ్లేషిస్తోంది. దీనితోపాటు ఆదాయపు పన్ను చెల్లించేవారి రేషన్?కార్డులను తొలగించే ప్రక్రియను మొదలుపెట్టింది. ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్?లో సబ్సిడీని తీసే ప్రక్రియను ప్రారంభించింది.

**గ్యాస్ అందుబాటులో లేక ఇబ్బందులు**

కమర్షియల్ గ్యాస్ కొనుగోలు చేసే స్థోమత లేక చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాన్ని మూసివేసుకోవడమే మార్గంగా భావిస్తున్నారు. కొందరు ఇప్పటికే దుకాణాలు మూసేశారు. గ్యాస్?ను అధిక ధరలకు కొనుగోలు చేయలేక ప్రైవేటు హాస్టల్స్? యజమానులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీజీ హాస్టల్స్?లో కట్టెల పొయ్యిపైనే వంటలు చేయాలని యజమానులు భావిస్తున్నారు.

**టిఫిన్‌లపై అధిక వసూలు**

గ్యాస్? కొరత కారణంగా దోశ, ఇడ్లీ, వడలపై అదనంగా రూ. 5 నుంచి రూ.10 వరకు ఎక్కువ నగదును వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితికి ఒక్క టిఫిన్?కే రూ.45 నుంచి 50 ఖర్చు అవుతున్నాయి. టిఫిన్?ల ధరలకు సామాన్య ప్రజలు బతకడం చాలా కష్టంగా ఉంది. కొన్ని కాలేజీలు, యూనివర్సిటీల్లో మెస్ ఛార్జీలు పెంచడం వల్ల నగదు ఇబ్బందిగా ఉంది విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇలాగే కొనసాగితే చదువులు ఇక ముందుకు కొనసాగలేవంటూ వాపోతున్నారు.

## శ్రీవాణి టికెట్లు హైజాక్ చేస్తున్న ఏజెంట్లు

హ్యాకింగ్ జరుగుతోందా, లోపల ఎవరైనా సహకరిస్తున్నారా అనే కోణాల్లో విచారణ సాగుతోంది.

**ఒక్కో టికెట్‌పై రూ.3 వేల వరకు దోపిడీ**

చెన్నైకి చెందిన ఎంఎస్ పద్మావతి ట్రావెల్స్ అనే సంస్థ శ్రీవాణి టికెట్ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఆన్?లైన్?లో టికెట్ కావాలని మెసేజ్? చేస్తే చాలు రూ.13,500 డబ్బులు పంపండి. మీకు టికెట్ వస్తుందని సమాధానమిస్తున్నట్లు విజిలెన్స్ విభాగం గుర్తించింది. రూ.10,500 టికెట్?కు భక్తుల నుంచి అదనంగా రూ.3 వేలు గుంజుతున్నారు.ఈ వ్యవహారంపై ఈనెల 7వ తేదీన తిరుమల వన్?టౌన్ పోలీస్? స్టేషన్?లో కేసు నమోదైంది. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు చెన్నై వెళ్లాయి. ఆ ట్రావెల్స్ వెబ్‌సైట్‌ను బ్లాక్? లిస్ట్?లో పెట్టారు. టికెట్ బుక్ చేసినప్పుడు ఫొటో తీసి, దర్శనం వద్ద ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా పరిశీలిస్తే ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. గతంలో బెంగళూరుకు చెందిన ఒక సంస్థ దీనిపై ప్రయోగాత్మక పరిశీలన కూడా చేసింది.




# క్రికెట్ శిక్షణ ప్రారంబించి

# ఆర్థిక సాయం చేసిన చైర్మన్

**టీ మీడియా, మే 13 ,పెబ్బేర్:**పెబ్బేరు పట్టణంలోని మినీ స్టేడియంలో మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ శిబిరాన్ని ప్రారంభించి యువ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. .ఈ సందర్భంగా పేద కుటుంబాలకు చెందిన యువ క్రికెటర్ల కోసం క్రికెట్ సామగ్రి కొనుగోలుకు చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ రూ10 వేల ఆర్థిక సహాయం అందించారు ఆయన సహాయంపై క్రీడాకారులు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారుమహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ మే నెల నుంచి జూన్ వరకు నెల రోజులపాటు శిక్షణ శిబిరం కొనసాగుతుందని తెలిపారు అనుభవజ్ఞులైన కోచ్‌ల ఆధ్వర్యంలో బ్యాటింగ్ బౌలింగ్ ఫీల్డింగ్‌తో పాటు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు చెప్పారు ఈ కార్యక్రమంలో స్థానిక క్రీడాకారులు యువత క్రికెట్ అభిమానులు అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా యువ ఆటగాళ్లు ఉత్సాహంగా ప్రాక్టీస్ నిర్వహించారు.

# హిందూయిజం ఒక జీవన విధానం

**- గుడికి వెళ్లడం తప్పనిసరేం కాదు**

**టీ మీడియా, మే 13 , న్యూఢిల్లీ బ్యూరో :** హిందూయిజం అనేది జీవన విధానమని, ఈ విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి గుడికి వెళ్లడం లేదా పూజలు చేయడం తప్పనిసరేం కాదని తొమ్మిది మంది న్యాయమూర్తుల సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. హిందూయిజంపై విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి ఇంట్లో ఒక దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుందని తేల్చి చెప్పింది. కేరళలోని శబరిమల ఆలయం సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లతో పాటు దావూదీ బోహ్రాలతో సహా పలు మతాలు పాటించే మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరిపే క్రమంలో బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బి వరాలే, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి కూడా ఉన్నారు.

**శబరిమల ఆలయ ప్రవేశ తీర్పు - పునస్సమీక్ష పిటిషన్లపై విచారణ**

శబరిమల ఆలయ ప్రవేశ తీర్పును 2018 సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు ఇచ్చింది. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని 4:1 మెజారిటీతో ఆనాడు సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. 2018 నాటి ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పునస్సమీక్ష పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. దీనిపై తమ వాదనలను కూడా వినాలంటూ పలువురు మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. ఈ విచారణలో భాగంగా 15వ రోజున (బుధవారం) మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జి. మోహన్ గోపాల్ వాదనలు వినిపించారు.

**ఇప్పుడందరూ వేదాలను అంగీకరిస్తున్నారా?**

"హిందూ మతంలోని పలు వర్గాల నుంచే సామాజిక న్యాయం కోసం డిమాండ్ వస్తోంది. హిందూయిజాన్ని ఒక మత వర్గంగా నిర్వచించారు. మతం, తత్వశాస్త్రానికి సంబంధించిన అన్ని విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరించేవాడే హిందువు అని 1966లో తీర్పు ఇచ్చారు. హిందువులందరి అభిప్రాయాలను తీసుకోకుండానే గతంలో కోర్టులు ఈవిధంగా ఒక నిర్ణయానికి వచ్చాయి. హిందువుల్లో ఎవ్వరూ ఎప్పుడూ అలా చెప్పలేదు. నాకు వేదాల పట్ల అత్యంత గౌరవం, గొప్ప ఆరాధనా భావం ఉన్నాయి. కానీ, నేడు హిందువులుగా వర్గీకరించిన ప్రతి ఒక్కరూ అన్ని ఆధ్యాత్మిక, తాత్విక విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరిస్తున్నారు అన్నది వాస్తవమేనా?" అని మధ్యంతర పిటిషన్ దాఖలుచేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జి. మోహన్ గోపాల్ సుప్రీంకోర్టులో వాదన వినిపించారు.



**అందుకే హిందూ మతాన్ని జీవన విధానం అంటారు**

ఈ వాదనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ, "అందుకే హిందూ మతాన్ని ఒక జీవన విధానం అంటారు. ఒక హిందువు హిందువుగా ఉండటానికి తప్పనిసరిగా గుడికి వెళ్లడం గానీ, ఏదైనా ఆచారం పాటించడం గానీ అవసరం లేదు" అని ఆమె పేర్కొన్నారు. "ఆచారబద్ధంగా ఉండాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ విశ్వాసాన్ని కలిగి ఉండటానికి ఎవరూ అడ్డు రాలేరు" అని జస్టిస్ నాగరత్న తెలిపారు. "ఒక వ్యక్తి హిందూ మత విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి, గుడిసెలో దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈసందర్భంగా కీలక వ్యాఖ్య చేశారు.

# పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా రంగసామి ప్రమాణం

ఎంపీ మన్సుఖ్? మాండవీయా అధిష్ఠాన ఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్ సురానా తదితరులు పాల్గొన్నారు.ఎన్నార్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు, బీజేపీ ఎమ్మెల్యే నమశ్శివాయం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే యానాం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మల్లాడి కృష్ణారావు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 30 అసెంబ్లీ స్థానాల్లో ఏఐఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి 18 స్థానాల్లో విజయం సాధించింది. ఏఐఎన్ఆర్ కాంగ్రెస్ 12, బీజేపీ 4, అన్నాడీఎంకే, ఎల్?జేకే చెరో ఒక స్థానంలో గెలుపొందాయి. ఇక డీఎంకే, కాంగ్రెస్ కూటమి 6 సీట్లు, టీవీకే, స్వతంత్రులు చెరో మూడు స్థానాల్లో విజయం సాధించాయి.

**సింపుల్ లైఫ్ స్టైల్‌తో రంగసామి**

పుదుచ్చేరిలోని తిలాస్‌పేట్టైలో 1950 ఆగస్టు 4న జన్మించిన రంగసామి, వాణిజ్యం, న్యాయశాస్త్రంలో డిగ్రీ చేశారు. కామరాజర్ అనుచరుడు. నటుడు శివాజీ గణేశన్‌కి వీరాభిమాని. ఇక రంగసామి హంగూ ఆర్భాటాలకు దూరంగా ఉంటూ సాధారణంగా జీవిస్తుంటారు. అవివాహితుడైన రంగసామి ఆయనది సింపుల్ లైఫ్‌స్టైల్. తురచూ బైక్?పై ప్రయణిస్తుంటారు. కాస్త ఖాళీ దొరికితే టెన్నిస్ ఆడుతూ కనిపిస్తారు. అందరి మధ్యా ఉంటూ క్రికెట్ చూడటం ఆయనకు బాగా ఇష్టం.

**1990లో రాజకీయాల్లోకి ఎంట్రీ**

పుదుచ్చేరి మాజీ మంత్రి పెట్టా పెరుమాళ్‌కు సహాయకుడిగా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. అలా 1990 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున తట్టంచావడి నంచి పోటీ చేయడంతో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. కానీ ఆ ఎన్నికల్లో 989 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత 1991, 1996, 2001, 2006 ఎన్నికల్లో అదే స్థానం నుంచి గెలుపొందారు. 1991లో మంత్రిగా, 2001, 2006లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్‌లో అంతర్గత సమస్యల కారణంగా 2008లో పదవికి రాజీనామా చేశారు.

**ఎక్కువసార్లు సీఎంగా బాధ్యతలు**

ఇక రంగసామి 2011 ఫిబ్రవరిలో ఆలిండియా ఎన్నార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి, అదే ఏడాది శాసనసభ ఎన్నికల్లో మూడోసారి ముఖ్యమంత్రి అయ్యారు. పార్టీ ప్రారంభించిన 48 రోజులకే ఆయన అధికారంలోకి వచ్చారు. 2011 ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి పోటీచేసి రెండుచోట్లా విజయ పతాకం ఎగురవేశారు. 2016 ఎన్నికల్లోనూ గెలిచారు. 2011 నుంచి 2016 వరకు పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఉన్నారు. 2016-2021 మధ్య ప్రతిపక్షనేతగా వ్యవహరించారు. 2021 ఎన్నికల్లో యానాం, తట్టంచావడిలో పోటీచేసి, యానాంలో ఓడిపోయారు. 2021 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ కూటమి ఏర్పాటు చేసుకున్న ఎన్నార్ కాంగ్రెస్ విజయం సాధించి నాలుగో సారి సీఎం అయ్యారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రంగసామి రెండు స్థానాల్లో పోటీ చేశారు. తట్టంచావడిలో 4,441 ఓట్ల మెజారిటీతో గెలవగా, మంగళం నియోజకవర్గంలో 7,050 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇప్పుడు ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చరిత్ర సృష్టించారు.అయితే నామినేషన్ దాఖలు చేసేటప్పుడు తనకు రూ.27.99 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు రంగసామి వెల్లడించారు. 12 గ్రాముల బంగారు ఉంగరం, 12 గ్రాముల ముత్యాలహారం, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు ఉన్నట్లు పేర్కొన్నారు. తట్టంచావడి మార్కెట్ ప్రాంతంలో రూ.8కోట్ల విలువైన స్థలం, రెండు ఇళ్లు ఉన్నట్లు తెలియజేశారు. ఇవి పూర్వీకుల ఆస్తులు. రూ.28 లక్షల పెట్టుబడులు ఉన్నాయని, వ్యక్తిగతంగా ఒకరికి రూ.30లక్షలు, మరొకరికి రూ.5లక్షలు అప్పు చెల్లించాలని అఫిడవిట్‌లో వెల్లడించారు.

# ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి

ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ కలిసి పని మట్నదలుపెట్టారని తెలిపారు. డిసెంబర్ నాటికి భారత్‌కు క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాకు అమరావతి అవుతుందని రెండేళ్లలో ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు అమరావతి నుంచి సరఫరా చేస్తామని వెల్లడించారు. అలానే విదేశాలపై ఆధారపడకుండా అందరూ కరెంట్ ఉత్పత్తి తయారు చేసుకోవాలని అన్నారు. రూ.2.40కే యూనిట్ కరెంట్ ఉత్పత్తి చేస్తున్నామని కరెంట్ ఛార్జీలు తగ్గుస్తున్నామని సీఎం వివరించారు.

లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

సంపద సృష్టించడం చాలా సులభమని సీఎం అన్నారు. హైదరాబాద్ దేశానికి మెడికల్ హబ్‌గా తయారైందని కొనియాడారు. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తామని వెల్లడించారు. వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారని చెప్పారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అరాచకం గతంలో ఎప్పుడూ చూడలేదని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. 2027 మే 13న కిమ్స్ ఆస్పత్రిని ప్రారంభిస్తామని వెల్లడించారు. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ ఆపరేషన్‌లు ప్రారంభిస్తుందని అలానే 2028 డిసెంబర్‌లోపు ఫేస్ 1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకున్నాం. ప్రపంచంలో అనేక మార్పులు వస్తున్నాయి. వైద్యుల కంటే నర్సులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. రాష్ట్రంలో ఆరోగ్యానికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. యూరియా వేసి పంటలు పండిస్తున్నారు. అందరి ఆరోగ్యం కాపాడే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. భవిష్యత్తులో వర్క్ ఫ్రం హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. పది కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. ప్రతి ఇంటిపై సోలార్ పెట్టుకోండి విద్యుత్ ఛార్జీలు చెల్లించే అవసరం ఉండదు. సోలార్ ఏర్పాటు చేసుకునేవారికి సబ్సిడీ కూడా అందిస్తున్నాం."- చంద్రబాబు, ముఖ్యమంత్రి

విశ్వనగరంగా విశాఖ

రాజధానికి భూములిచ్చిన రైతులకు అండగా ఉంటామని ఫేజ్-2కు పిలుపునిస్తే రైతులు ముందుకొచ్చారని సీఎం అన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచంలోనే గొప్పదైన నగరంగా అమరావతి నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక్క అమరావతిపైనే శ్రద్ధ పెట్టట్లేదని విశాఖను విశ్వనగరంగా చేస్తున్నామని వివరించారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నామని అక్కడికి అనేక పరిశ్రమలు వస్తున్నాయని వెల్లడించారు. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం, టెక్నాలజీ హబ్‌గా రాయలసీమ తయారవుతోందని అన్నారు. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ వస్తోందని తెలిపారు. అలానే శ్రీసిటీ ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైందని సీఎం తెలిపారు. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు ఉన్నాయని గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుందని చెప్పారు.ప్రధాని ఇచ్చిన పిలుపుపై యువతలో ఆలోచన రావాలని అలానే మోదీ ప్రకటించిన పొదుపు చర్యలను ప్రతి ఒక్కరూ పాటించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఒకట్రెండు రోజుల్లో దీనిపై ప్రభుత్వ పరంగా ఓ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై పలు విధాలుగా భారం పడుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు పౌరులు కూడా బాధ్యతగా ఉండాలని సూచించారు. పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించడం ద్వారా విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని వివరించారు. అలానే బంగారం ఉత్పత్తి ప్రాజెక్టు రాష్ట్రంలో త్వరలోనే ప్రారంభం కాబోతోందని సీఎం వెల్లడించారు.



## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలి

**డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో** :ప్రభుత్వ పాఠశాలలను ప్రజల విశ్వాస కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పిలుపునిచ్చారు.వనపర్తి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యచరణలో భాగంగా ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా మున్నూరు కాపు భవన్‌లో సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు పాఠశాల విద్యా కార్యక్రమాలపై అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు పలు సంస్కరణలు చేపడుతున్నట్లు తెలిపారు.పాఠశాలల అభివృద్ధి కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సర్పంచులు తరచూ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన నాణ్యత వంటి అంశాలను పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యా వారోత్సవాలు విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంచడంతో పాటు పాఠశాలల పట్ల సమాజ బాధ్యతను కూడా పెంచుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈవో అబ్దుల్ గని, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ఆలయ అభివృద్ధికి సహకరించిన సేవకులు టి.జె.విశ్వేశ్వర్

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోనీ శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఆలయ అభివృద్ధికై,ప్రముఖ సామాజిక సేవకులు, సహృదయులు, నిరాడంబరులు, శ్రీ వాణి హై స్కూల్ అడ్వైజర్ టి.జె. విశ్వేశ్వర్ ఒక లక్ష ముప్పై వేయిల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారికి,వారి కుటుంబంపై ఆ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని, ఆలయ కమిటీ సభ్యులు ఆ పెద్దమ్మ తల్లిని ప్రార్థించారు.

## అంబేద్కర్ జీవిత చరిత్రను పున ప్రసారం చేయాలి

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :** ??అణగారిన వర్గాల ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తిదాయక జీవిత విశేషాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని బీజేపీ సీనియర్ నాయకులు ద్యారపోగు సుబ్రమణ్యం కోరారు.గతంలో ప్రసారమైన ఆయన జీవిత చరిత్ర సీరియల్‌ను మన తెలుగు టీవీ ఛానల్స్‌లో వెంటనే పునః ప్రసారం చేయాలని సవినయంగా కోరారు.?భారత రాజ్యాంగ శిల్పి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర కేవలం ఒక కథ కాదు, అది కోట్లాది మందికి స్ఫూర్తి. ఆయన పడిన పోరాటం, సాధించిన విజయం నేటి యువతకు ఎంతో అవసరం. ?తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రముఖ తెలుగు టీవీ ఛానల్స్ వారు అంబేద్కర్ జీవిత చరిత్రను మళ్ళీ ప్రసారం చేయాలని మనస్ఫూర్తిగా కోరారు.





## కనుమరుగు ఆవతున్న వినోభా భావే, నెహ్రూ జ్ఞాపకాలు

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో** : పానుగల్ (మం) మధరావుపల్లి గ్రామం ను సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ సభ్యులు బుధవారం సందర్శించారు. 07-03-1956 నాడు భుధాన్ ఉద్యమం లో పాద యాత్ర చేస్తు మదవరావుపల్లి చెరుకున వినోభా భావే వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల భవం ప్రారంభోత్సవం కోసం వనపర్తికి వచ్చిన భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వినోభా భావే మాధరాపల్లి లో ఉన్నారాని తెలుసుకొని. మధరాపల్లి కి వెల్లి భాష ప్రయుక్త రాష్ట్రాల ఎర్రపటుకు చర్చినట్లు అక్కడే భాషా పరంగా రాష్ట్రాలు ఎర్పాట్టుకు శ్రీకారం జరిగింది.భూదాన్ ఉద్యమమ్ ద్వారా 44 లక్షల ఎకరాల భూములు దాన పూర్వకంగా 40 లక్షల మంది పేదలకు భూములు పంపిణీ చెయిన్చిన్నా వినోభా భావే ఇద్దరు గొప్ప నాయకులు కలిసిన ప్రాంతం మాదారావుపల్లి. చరిత్రాత్మక మైనా నిర్నయలు చర్చలు జరిగిన స్థలం మధరావుపల్లి గ్రామం అలనాటి జ్నాపకలు గుర్తుగా చిరకాలం ఉండాల్సిన ప్రాంతం కనుమరుగు అవుతుంది. కావున ప్రభుత్వం వెంటనే ఆ ప్రాంతంలో వినోభా భావే ,నెహ్రూ విగ్రహాలు ఎర్పట్టు చేసి పార్క్ ను సందర్షకులకు అందుబాటు చేసి భావి తారలకు చరిత్ర తెలియచేయాల్సింది అన్ని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక సభ్యులు ఉప్పరి తిరుమలేష్, భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.